


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 07-07-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 259 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పాఠశాలలకు ఆహ్లాదకర రంగులు



- స్కూల్ గోడలపై చక్కగా బొమ్మలు కూడా గీయాలి
- ప్రజాధనం వృధాకాకుండా పనులు చేపట్టి, వేగంగా పూర్తి చేయాలి
- సచివాలయాల ఇంజనీర్లకు కొత్త బాధ్యతలు
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

అమరావతి: మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్న ప్రభుత్వం, స్కూల్ భవనాలన్నింటికీ కొత్తగా పెయింటింగ్స్ వేయిస్తోంది. ఆ రంగులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆ మేరకు పలు రంగుల నమూనాలను అధికారులు సమావేశంలో ప్రజెంటేషన్ రూపంలో సీఎంకు చూపారు. ఈ కార్యక్రమానికి జగన్ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ చినవీరభద్రుడితో పాటు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. స్కూల్ బిల్డింగ్‌లకు వేసే రంగులు ఆహ్లాదకరంగా ఉండాలని, అక్కడ ఓ పండగ వాతావరణం కనిపించాలని సీఎం అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పిల్లలకు అన్ని విషయాలపై తగిన అవగాహన కలిగేలా స్కూల్ గోడలపై చక్కగా బొమ్మలు కూడా గీయాలని సూచించారు. ప్రజాధనం వృధాకాకుండా వర్షాకాలం తర్వాత ఆ పనులు చేపట్టి, వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. మరోవైపు మన బడి నాడు- నేడు రెండు, మూడో దశ పనులకు అవసరమయ్యే రుణ సేకరణ ప్రక్రియను మొదలుపెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. మన బడి నాడు-నేడులో భాగంగా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.2 వేల కోట్ల రూపాయల పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు సీఎంకు నివేదించారు.

పలు చోట్ల దాతలకు అప్పజెప్పిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. దీంతో దాతలను వెంటనే ఆయా బాధ్యతల నుంచి తప్పించి, జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని సీఎం ఆదేశించారు.

**సచివాలయాల ఇంజనీర్లకు కొత్త బాధ్యతలు**

గ్రామ సచివాలయాల ఇంజనీర్లు మన బడి నాడు-నేడు పనులను కూడా చూడాలని, వారు ప్రతిరోజూ తప్పనిసరిగా స్కూళ్లను సందర్శించాలని సీఎం జగన్ సూచించారు. వారానికి ఒకసారి పనులపై నివేదిక అందజేయాలని [తరువాయి 2లో..




## జగన్ మంచి చేస్తుంటే.. టీడీపీ కుట్రలు చేస్తోంది..

### మంత్రి బొత్స సత్యనారాయణ



విజయవాడ: పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి చేస్తుంటే ప్రతిపక్షం కుట్ర చేస్తోందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ "మొదట 25 లక్షలు అనుకున్నాం, 30 లక్షలు పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ [తరువాయి 2లో..

### విశాఖ గ్యాస్ లీక్ ఘటనపై

## సీఎంకు హైపవర్ కమిటీ నివేదిక

- 4వేల పేజీల నివేదిక సమర్పణ
- అల్లారం ఆన్ చేయకపోవడం అతి పెద్ద నిర్లక్ష్యం



అమరావతి : విశాఖ ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటనపై ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తుది నివేదికను సమర్పించింది. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించిన నివేదికలో పలు ముఖ్య అంశాలను ప్రస్తావించింది. ఘటనకు సంబంధించి అనే కోణాల్లో అధ్యయనం చేసిన నీరబ్ కుమార్ నేతృత్వంలోని కమిటీ 4వేల పేజీల నివేదికలో కీలక విషాయాలను వెల్లడించింది. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల స్టైరిన్ ట్యాంకుల్లో ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదానికి దారితీసిందని కమిటీ నివేదికలో పేర్కొంది. సీఎంకు నివేదిక సమర్పించిన అనంతరం కమిటీ చైర్మన్ నీరబ్ కుమార్ 'సాక్షి'తో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. విశాఖలో జరిగింది కేవలం గ్యాస్‌లీకేజీ మాత్రమే కాదని అనియంత్రిక స్టైరిన్ కూడా పెద్ద ఎత్తున విడుదలైందని తెలిపారు. ట్యాంకుల్లో ఉష్ణోగ్రతలను కాపాడం చాలా కీలకమైన విషయామని, అయితే ఎల్జీ పాలిమర్స్ విషయంలో తీవ్ర తప్పదం జరిగిందని పేర్కొన్నారు. 2019 డిసెంబర్‌లో రిఫ్రిజిరేషన్ పైపులు మార్చారని, దీనివల్ల కూలింగ్ సిస్టమ్ పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామని చెప్పారు.

**సైరన్ ఆన్ చేయకపోవడం అతి పెద్ద నిర్లక్ష్యం**

'ఫ్యాక్టరీలో ఉష్ణోగ్రత కొలిచే పరికరం ట్యాంకు కింది భాగంలో అమర్చారు. దీనివల్ల ట్యాంకు మధ్యభాగంలో పైభాగంలో ఎంత టెంపరేచర్ నమోదు అవుతోంది తెలుసుకోలేకపోయారు. స్టైరిన్ పాలిమరైజేషన్ అవుతోందని వారికి డిసెంబర్‌లోనే రికార్డు అయింది. కానీ దీనిని వారు హెచ్చరికగా భావించలేదు. ఓ వైపు

### దిశ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన

## డిజిపీ గౌతమ్ సవాంగ్



అనకాపల్లి : విశాఖ పర్యటనలో బాగంగా డిజిపిగౌతమ్ సవాంగ్ సోమవారము అనకాపల్లి నూతన పోలీసు స్టేషన్ ను సందర్శించారు.అనంతరము ఉన్నతాధికార్లుతో సమావేశం ఏర్పాటుచేసి కరోనా పాజిటివ్ కేసులుపై అరా తీసారు. కరోనావైరస్ పట్ల ప్రజలును అప్రమత్తం చేయాలనీ సిబ్బందికి సూచించారు. కరోనా వైరస్ పట్లసిబ్బంది తగుజాగ్రత్తలు తీసికోవాలనీ విజ్ఞప్తిచేసారు. ఈకార్యక్రమంలో విశాఖరేంజ్ డిఐజీ రంగారావు,ఎస్ పి కృష్ణారావు,డియస్ పి శ్రావణి,టౌన్ సిఐ బాస్కర్ రావు,రూరల్ సిఐ నర్సింహరావు ఎస్ ఐలు అదికారులు పాల్గొన్నారు. వీరి వెంట ఎల్.కె.వి. రంగారావు ఐపీఎస్ డిఐజి విశాఖపట్నం రేంజ్,

బొడ్డేపల్లి కృష్ణారావు ఐపీఎస్ ఎస్పి విశాఖపట్నం జిల్లా, రాహుల్ దేవ్ సింగ్ ఐపీఎస్ స్పెషల్ ఆఫీసర్ ఎస్.ఈ.బి., కె.శ్రావణి డీఎస్పీ అనకాపల్లి సబ్ డివిజన్ వీరి వెంట ఉన్నారు.




## ప్రపంచంలో మూడో స్థానంలో భారత్

### కేసుల నమోదులో ప్రతిరోజు కొత్త రికార్డే

న్యూఢిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి మహోగ్ర రూపం దాల్చింది. ఏ రోజుకారోజు అధిక సంఖ్యలో కేసులు నమోదవుతూ రికార్డులు సృష్టిస్తోంది. గడిచిన 24 గంటల్లో సుమారు 25 వేల పాజిటివ్ కేసులు నమోదవగా 613 మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 6,73,165కి చేరింది. అయితే [తరువాయి 2లో..






## డ్రగ్స్ కేసుపై లోతైన విచారణ

### పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ మీనా



విశాఖపట్నం : నగరంలో వెలుగుచూసిన డ్రగ్స్ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు జరుపుతున్నామని పోలీసు కమీషనర్ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసుకు [తరువాయి 2లో..

## అచ్చెన్న పిటిషన్‌పై తీర్పు వాయిదా

అమరావతి : ఈఎస్ఐ మందుల కొనుగోలులో అవకతవకల కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, తెదేపా శాసనసభ ఉపనేత, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది.ం తనను ప్రైవేటు ఆస్పత్రికి తరలించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ అచ్చెన్నాయుడు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తీర్పు ప్రకటనను ఎల్లుండికి వాయిదా వేసింది. తెదేపా ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. ఈఎస్ఐ ఆసుపత్రులకు సంబంధించి మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైకాపా ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. ఈఎస్ఐలో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ [తరువాయి 2లో..

## వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



శ్రీకాకుళం : జులై 6 పుడు జంతువుల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం జిల్లా పశు సవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరిక ఈశ్వరరావు అన్నారు. సోమవారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం పశుసంవర్ధక శాఖ ఆవరణలో కుక్కలకు ఉచిత టీకాలు వేశారు.ఈ సందర్భంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవ ప్రాధాన్యత వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో అన్ని పశువైద్య కేంద్రాల్లో ఉచిత టీకాలు జంతువులకు వేస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న పశుసంవర్ధక కార్యాలయాల్లో జునోసిస్ దినోత్సవ సందర్భంగా పెద్ద ఎత్తున అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి.. రైతులకు..పెంపుడు జంతువులు పెంచే వారికి అవగాహన కల్పించామని చెప్పారు. నెల 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పశు వైద్య సేవలు ప్రారంభిస్తున్నామని,పశుసహాయకుల ద్వారా కృత్రిమ గర్భధారణ తో సుంకర, మేలుజాతి దూడలు ఉత్పత్తిని అభివృద్ధి చేయడం జరుగుతుందని, వీటితోపాటు మిగతా వైద్య సేవలు కూడా ఉంటాయన్నారు.పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు, గొర్రెలు,మేకల పెంపకం కోసం రైతు భరోసా పశు నష్టపరిహారం పథకం దోహదపడుతుందని అన్నారు.జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈ రోజు జిల్లాలో అన్ని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నామని,కరోనా వైరస్ నేపథ్యంలో ఆయా జంతువులు యజమానులు తొలిరోజునే టీకాలు కోసం పోటీపడొద్దని,ఈ కార్యక్రమం మరో రెండు రోజులు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ప్రజలు కరోనా వైరస్ పట్ల ఎంతో జాగ్రత్తలు తీసుకున్న విధంగా పెంపుడు జంతువుల పెంపకం విషయంలో తగు జాగ్రత్తలు తీసికోవాలని..లేకపోతే పెనుప్రమాదం ముంచుకు వస్తుందని జాయింట్ డైరెక్టర్ ఈశ్వరరావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పశుసంవర్ధక శాఖ వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ పి.మోహినీ కుమారి,డాక్టర్ ఎం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

భీమునిపట్నం: జీవీఎంసీ నాల్గో వార్డు పరిధి మంగమారిపేటలో గ్రామ పూజారి సూరాడ అప్పారావు , సుజాత దంపతులు లక్ష రూపాయలు వెచ్చించి రెండు వందల మంది పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి బియ్యం ప్యాకెట్లు, నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరికిన ఎల్లయ్య ( కింగ్) , మాజీ ఎంపీటీసీ వాసుపల్లి ఎల్లయ్య, దూడ అచ్చారావు, నాయకులు ఎస్ అప్పన్న, బడే దాసు , ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో చెరువు ప్రక్షాళన

భీమునిపట్నం : సంగివలస మూడు గుళ్ల వద్ద ఉన్న చెదుర్గంధ పూరితమైన చెరువును సోమవారం మత్స్యకారులు ఆ చెరువు ని ప్రక్షాళన చేశారు. గతంలో చెరువు లోనికి చుట్టుపక్కల ఉన్న ఆస్పత్రి వ్యర్థాలు శుద్ధి చేయకుండా చెరువు లోనికి విడిచిపెట్టడం తో చెరువు దుర్గంధ గా మారింది రసాయనాలు కలిపిన నీరు వ్యవసాయ భూముల సాగునీరు చెరువులోకి వస్తుండడంతో చెరువు కాలుష్యం గా మారిందని చుట్టు పక్కల వాళ్ళు దుర్గంధం భరించలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేయడం తో సంగివలస గ్రామస్తులు అభ్యర్థన మేరకు దివిస్ యాజమాన్యం చెరువును ప్రక్షాళన చేయడానికి ముందుకు వచ్చిందని దివిస్ జీఎం కోటేశ్వరరావు సూచనలతో ఇక్కడ చేపలు చేస్తున్న సాంప్రదాయ మత్స్యకారులు చెరువులో దిగి చెత్తాచెదారం తొలగించి జివిఎంసి సిబ్బంది చెరువులో బ్లీచింగ్ జల్లారు. అక్కడ సంగివలస ప్రజలు దివీస్ జీఎం కోటేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈ విజయ జీవి ఎంసీ శానిటరీ ఇన్స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు మూడుగుళ్ల ఈవో శాస్త్రి దివిస్ ప్రతినిధులు శ్రీ యస్ ఆర్ మేనేజర్ సురేష్ కుమార్ మరియు శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### మొదటి పేజీ తరువాయి

## పాఠశాలలకు ఆహ్లాదకర రంగులు

ఆదేశించారు. స్కూళ్లకు సంబంధించిన మెజర్ మెంట్ బుక్ (ఎంబీ)లో రికార్డింగ్ అధికారాన్ని కూడా సచివాలయ ఇంజనీర్లకు ఇవ్వాలని, ఆ మేరకు నిబంధనలకు రూపకల్పన చేయాలని పెద్దాఫీసర్లకు సూచించారు.

**జగన్ మంచి చేస్తుంటే.. టీడీపీ కుట్రలు చేస్తోంది..**

సిద్ధమయ్యారు. భూములు స్వచ్ఛందంగా ఇచ్చారు. భూ సేకరణ ద్వారా పేదలకు భూమి ఇచ్చేందుకు సిద్ధం అవుతుంటే ప్రతిపక్షం అడ్డంకులు సృష్టిస్తుంది. కోర్టులు నుంచి స్టే తీసుకు వచ్చి టీడీపీ కుట్రలు చేస్తోందని'' మంత్రి బొత్స ధ్వజమెత్తారు. టీడీపీ చేస్తున్న కుట్రలను ప్రజలను గమనిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా చేపట్టలేదని మండిపడ్డారు.

**తండ్రి స్ఫూర్తితో..**

నాడు దివంగత మహానేత వైఎస్సార్ ప్రతి పేదవారికి ఇళ్లను అందిస్తే.. అదే స్ఫూర్తితో నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్ల స్థలాలను అందించేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఈ రోజు పేదలకు ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాలు ఆలస్యం కావచ్చేమో గానీ ఇవ్వడం మాత్రం పక్కా అని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

**నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు..**

విజయవాడ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు బొత్స తెలిపారు. నగరంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని పేర్కొన్నారు. సింగ్‌నగర్‌లో రూ.10 కోట్ల వ్యయంతో మోడల్ పార్క్ అభివృద్ధికి శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. ఏడాది లోపు పూర్తి చేస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.

## డ్రగ్స్ కేసుపై లోతైన విచారణ

సంబంధించి నలుగురు నిందితుల్లో ఒకరైన మానుకొండ సత్యనారాయణ గతంలో రేవ్‌పార్టీ కేసులో నిందితుడిగా ఉన్నాడని చెప్పారు. సత్యనారాయణ, అతని స్నేహితుడు అజయ్ బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చినట్టు గుర్తించామని వెల్లడించారు. వీరు తీసుకొచ్చిన డ్రగ్స్‌కు మూలాలు బెంగళూరులో ఎక్కడున్నాయో గుర్తిస్తామని పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ కేసులో బెంగళూరు, గోవా పోలీసులు సహకారం తీసుకుంటామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారణ చేపడతామన్నారు. నగరంలో జరిగే పుట్టిన రోజు పార్టీలకు సరఫరా చేసేందుకు డ్రగ్స్ తీసుకువచ్చినట్టుగా తెలుస్తోందన్నారు. నిందితులు యువతను లక్ష్యంగా చేసుకుని ఈ దందా సాగిస్తున్నారని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడ్డవారిని గుర్తించి వారికి డీఎడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తామని తెలిపారు. సత్యనారాయణ కదలికలపై నిఘా పెట్టడం వల్లే డ్రగ్స్ ముఠా గుట్టురట్టైందన్నారు. సత్యనారాయణపై మూడు కేసులు ఉన్నాయని వెల్లడించారు.

## విశాఖ గ్యాస్ లీక్ ఘటనపై సీఎంకు హైపవర్ కమిటీ నివేదిక

ట్యాంకుల్లో ఉష్ణోగ్రత పెరగడం, స్టైరిన్ బాయిలింగ్ పాయింట్‌కు చేరడం, ఆవిరి రూపంలో బయటకు వెళ్లడంతో ప్రమాదం జరిగింది. స్టైరిన్ ఆవిరి రూపంలో బయటకు వెళ్లడానికి కారణాలేంటో పూర్తిగా డయాగ్రామ్ రూపంలో నివేదికలో పొందుపరిచాం. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే... స్టైరిన్ ట్యాంకుల్లో ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన తరువాత కూడా ఎల్జీ పాలిమర్స్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఫ్యాక్టరీలో 36 చోట్ల అల్లారం పాయింట్‌లున్నాయి.. ప్రమాదం జరిగినా సైరన్ మోగించలేదు. ఎల్జీ పాలిమర్స్‌లో అల్లారం ఆన్ చేయకపోవడం అతి పెద్ద నిర్లక్ష్యం. స్టైరిన్‌ను అదుపు చేసేందుకు కావాల్సిన రసాయనాలు పూర్తిస్థాయిలో ఫ్యాక్టరీలో లేవు. ఒకవేళ ఇలాంటి రసాయనాలు అందుబాటులో ఉంటే స్టైరిన్‌ను త్వరగా న్యూట్రలైజ్ చేసే అవకాశం ఉండేది. ఈ రసాయనాలను గుజరాత్ నుంచి తెప్పించాల్సి వచ్చింది. అప్పటికే ట్యాంకుల్లో టెంపరేచర్ పూర్తిగా పెరిగిపోయింది.

**ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదాలపై అధ్యయనం**

కేవలం ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికే పరిమితం కాకుండా దీనికి సంబంధించిన అన్ని విభాగాల పనితీరుపైనా మేము విచారణ చేశాము. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యమే కాని.. దానితోపాటు పరిశ్రమల భద్రత, పర్యావరణ సంరక్షణ కూడా ముఖ్యమే. దీని కోసం తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలో చర్చించాము. ఎల్జీ పాలిమర్స్ లాంటి ప్రమాదకరమైన రసాయనాలతో కూడిన ఫ్యాక్టరీ జనావాసాల్లో ఉండేందుకు వీల్లేదు అని నివేదికలో స్పష్టంగా చెప్పాము. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ప్రమాదాలపై అధ్యయనం చేసి ఇలాంటి ఫ్యాక్టరీలు ఎక్కడ ఉండాలనే దానిపై సూచనలు చేశాం. చాలా ఫ్యాక్టరీల్లో స్టైరిన్‌లాంటి కెమికల్స్ వాడుతుంటారు ఇలాంటి ఫ్యాక్టరీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిబంధనలు సూచించాం. పరిశ్రమల భద్రతకు సంబంధించి ఒకే ఏజన్సీకి అధికారాలివ్వాలని సూచించాం. ప్రమాదకర రసాయనాల ఫ్యాక్టరీలను జనావాసాల కంటే దూరంగా ఏర్పాటుచేయాలి. మాస్టర్ ప్లాన్ తయారు చేసే సమయంలోనే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్జీ పాలిమర్స్‌ను వేరే ప్రాంతానికి తరలించడం మంచిది అనే మా అభిప్రాయం' అని నివేదికలోని వివరాలు వెల్లడించారు.

## ప్రపంచంలో మూడో స్థానంలో భారత్

అదేరోజు సాయంత్రం నాటికి మరిన్ని కేసులు వెలుగు చూడటంతో మొత్తం కేసుల సంఖ్య 6.9 లక్షలుగా నమోదైంది. దీంతో 6.8 లక్షల కేసులున్న రష్యాను వెనక్కునెట్టి ప్రపంచంలో కరోనా ప్రభావిత జాబితాలో భారత్ మూడో స్థానానికి ఎగబాకిందని అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడించింది. అమెరికా(28 లక్షలు), బ్రెజిల్(15 లక్షలు) తర్వాత స్థానంలో భారత్ నిలిచింది. ఒక్క మహారాష్ట్రలోనే పాజిటివ్ కేసుల సంఖ్య రెండు లక్షల మార్కును దాటడం కలవరపరిచే అంశం. గత 24 గంటల్లో మహారాష్ట్రలో 7,074 కేసులు, తమిళనాడులో 4,280 కేసులు నమోదయ్యాయి. మరోవైపు దేశంలో మొత్తం మరణాల సంఖ్య 19,268కు చేరగా రికవరీ రేటు 60.77 శాతంగా నమోదయ్యింది. ఇదిలా వుండగా కరోనా కల్లోలానికి ముగింపు పలికేందుకు అందుబాటులోకి తీసుకురానున్న వ్యాక్సిన్‌ల ప్రయోగాలు వేగవంతం అయ్యాయి. అందులో భాగంగా కొవాక్సిన్, జైకొవ్-డీ అనే రెండు స్వదేశీ కరోనా టీకాలను మానవ క్లినికల్ ట్రయల్స్‌కు అనుమతి లభించిన విషయం తెలిసిందే.

## అచ్చెన్న పిటిషన్‌పై తీర్పు వాయిదా

దర్యాప్తులో తేలింది. నకిలీ కొటేషన్లతో ఆర్డర్లు ఇచ్చినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ కమిటీ నివేదిక ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

## మైనారిటీ ఖవ్వాలి కళాకారులు 7లోగా దరఖాస్తులు సమర్పించాలి

*- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి యం.అన్నపూర్ణమ్మ*

శ్రీకాకుళం : జిల్లాలోని అర్హులైన మైనారిటీ ఖవ్వాలి కళాకారులందరూ జూలై 7లోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, విజయనగరం వారి ఇ - మెయిల్ ఐడి dmwoviziznagaram @ gmail.com నకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి యం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు.

కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ , విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లాలోని 38 మండలాలతో పాటు అన్ని పురపాలక ప్రాంతాలు, నగరపాలకసంస్థ పరిధిలోని మైనారిటీ ఖవ్వాలి కళాకారులకు ( ముస్లింలు ) రూ.1500/-ల నుండి రూ.3,000/-ల వరకు పింఛన్లను మంజూరుచేయుటకు జి.ఓ.ఆర్.టి నెం.8, తేది08.02.2019 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కావున ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్లకు అర్హులైన మైనారిటీ ఖవ్వాలి కళాకారులందరూ తమ వివరాలను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 05.00గం.ల్లోగా పై తెలిపిన ఇ-మెయిల్ కు పంపించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు. మైనారిటీ ఖవ్వాలి కళాకారుల పింఛనుకు ఈ దిగువ అర్హతలు తప్పనిసరి అని ఆమె ఆ ప్రకటనలో స్పష్టం చేసారు.

- కళాకారులకు 58 ఏళ్లు పూర్తి అయిఉండాలి.
- ప్రొఫెషనల్ ఆర్టిస్టులు అయిఉండాలి.
- దారిద్ర్యరేఖకు దిగువ గలవారై ఉండాలి.
- కళాకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఎటువంటి పింఛనును పొంది యుండరాదని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

## కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో మొకర నారాయణరావు 8వ వర్ధంతి



భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మొకర నారాయణరావు 8వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మొకర నారాయణరావు రాజకీయ దురందరుడని, ఎంతోమందికి రాజకీయ ఓనమాలు నేర్పిన చాతుర్యం ఉన్నవారని కొనియాడిరి. 1983 లో రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించేటప్పుడు మీద మమకారం, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరారని, భీమునిపట్నం నుండి తెలుగుదేశం పార్టీలో చేరిన మొదటి వ్యక్తి మొకర నారాయణరావు అని అన్నారు. చివరివరకు తెలుగుదేశం పార్టీలో ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా, భీమిలి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గా, వుడా డైరెక్టర్ గా ఎన్నో ఉన్నతమైన పదవులు పొందారని చెప్పారు.రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా , ఎన్ని పదవులు ఆయన్ని వరించినా ఒదిగి ఉండేవారని, భీమిలిలో ఇప్పుడున్న రాజకీయ చైతన్యానికి మొకర నారాయణరావు ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగవంశం సంఘ సభ్యులు అప్పికొండ ఆదినారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొండా నరసింహమూర్తి, అప్పికొండ అప్పలనాయుడు, టీడీపి నాయకులు సంకురుబుక్త జోగారావు, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోర్టు స్కూల్ మూసివేస్తే ఆందోళనే

**యాజమాన్యం మొండివైఖరి విడనాడాలి**
**అఖిల పక్షాల వినతి**

విశాఖపట్నం : సాలగ్రామపురం పోర్టు స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించి, మూసివేత ఆలోచన విరమించుకోవాలని యాజమాన్యాన్ని అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అయిదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పాఠశాలను మూసివేస్తున్నట్లు పోర్టు యాజమాన్యం జూన్ 17వ తేదీన ప్రకటించిన నేపథ్యంలో మూడు వారాలుగా ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. స్కూల్ మూసివేసే ఆలోచన విరమించుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు యాజమాన్యం ఒత్తిడి తెచ్చాయి. ఈ క్రమంలో సాలగ్రామపురం పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ చర్చా గోష్టిలో సీపీఎం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నరసింగరావు, సీనియర్ రాజకీయ నాయకులు భరణికాన రామారావు, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం పర్యవేక్షకులు పసుపులేటి ఉషా కిరణ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ, సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు పి. చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ స్థానిక వార్డు అధ్యక్షులు తుమ్మల త్రినాధరావు, బీజేపీ స్థానిక నాయకులు కొప్పిశెట్టి శంకరరావు, చైల్డ్ రైట్ ప్రొటక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు గొండు సీతారాం, సీనియర్ న్యాయవాది బాలల హక్కుల పరిరక్షణ కార్యకర్త అబ్దుల్ రఖీబ్, చిన్న పత్రికల సంఖ్య విశాఖపట్నం అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఏయూ విద్యార్థి సంఘం నాయుకుడు సమయం హేమంత్ కుమార్, సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు బి.వి.కె.బాబ్జి, జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు డబ్ల్యు వేణుగోపాలరావు, జి.అప్పారావు, వి.రంగారావు, పోర్టు ఐఎన్‌టియుసి కార్యదర్శి గొర్లె చందు, రాష్ట్ర నిరుద్యోగ సమాఖ్య నాయకుడు సమపల త్రినాధరావు, పలువురు ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పరిపాలనా సంబంధ కారణాల వల్ల పోర్టు స్కూల్ మూసివేస్తున్నట్లు జూన్ 17వ తేదీన యాజమాన్యం నోటీసు అతికించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ అంశంపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పోర్టు యాజమాన్యం పై ఒత్తిడి తీసుకువచ్చాయి. ఈ క్రమంలో జూలై మూడవ తేదీన పోర్టు పాఠశాల మూసి వేస్తున్నారని వదంతులు ఉన్నాయి. ఈ దిశగా అలాంటి నిర్ణయాలు తీసుకోలేదంటూ మరో నోటీసును యాజమాన్యం అతికించింది. ఇలాంటి గందరగోళ పరిస్థితిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పూర్వ విద్యార్థులు నిర్వహించారు. అయిదు దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాలను మూసివేసే ఆలోచనను శాశ్వతంగా విరమించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈనెల పదవ తేదీలోగా పోర్టు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని లేదంటే ఆందోళన ఉధృతం చేయనున్నట్లు రాజకీయ పక్షాలు, బాలల హక్కుల సంఘాలు స్పష్టం చేశాయి. శాశ్వత భవనాలు, విశాలమైన ఆట మైదానాలు, పచ్చని చెట్లు కలిగిన ఈ పాఠశాలలో జూనియర్ కాలేజీ నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

పేద, మధ్య తరగతి ప్రజలు ముఖ్యంగా కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న వేలాది మంది ప్రజలకు ఈ పాఠశాల ఎంతగానో ఉపయోగపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖ ఉత్తరం, భీమునిపట్నం నియోజకవర్గం ప్రజలకు ఈ పాఠశాల ఎనలేని సేవలు అందిస్తుందని చెప్పారు. పోర్టు యాజమాన్యం మొండి వైఖరిని విడనాడకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతుందని వక్తలు హెచ్చరించారు.

## ర్యాబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు టీకాలు




భీమునిపట్నం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ప్రభుత్వ ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ టీకాలు వేశామని సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకట రమణ తెలిపారు. ఈ ర్యాబిస్ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త గా ఈ ఏంటీ ర్యాబిస్ వాక్సిన్ వేయుంచు కోవాలని తెలియజేసారు. కుక్కలు పెంచు తున్న యజమానులు విధిగా పశువుల ఆసుపత్రికి కుక్కలను తీసుకుని వచ్చి ర్యాబిస్ టీకాలు వేయించు కోవాలని తెలిపారు. ఈ టీకాలు ఈ వారం లో ప్రతిరోజు ఆస్పత్రి వద్ద వేస్తామని తెలియజేశారు.ఈ శిభిరం లో 124 కుక్కలకి టీకాలు వేశారు.ఈ శిభిరం లో పశు వైద్య సిబ్బంది కె శ్రీనివాసరావు, కె. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## కమలం వైపు.. టీడీపీ మిడతల దండు!

*వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి*

అమరావతి: ఏమీ తినడానికి దొరకని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మిడతల దండు కమలం పువ్వు వైపు కదులుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు. ఇప్పటికే కొన్ని మిడతలు బీజేపీలో చేరి విధ్వంసం సృష్టిస్తున్నాయన్నాయని గ్రహించే లోగానే, మిగతావి ఎగురుకుంటూ బయల్దేరాయని చెప్పారు. ఈ విపత్తు నుంచి బీజేపీ ఎలా గట్టెక్కుతుందో ముందు ముందు చూడాలన్నారు.

అవసరాల కోసం స్వార్థంతో జెండాలు మార్చేవారంతా లిటిగేటర్ల అవతారం ఎత్తుతున్నారని విమర్శించారు. ప్రజాతీర్పును అపహాస్యం చేయాలని చూస్తే ఏ వ్యవస్థ ఉపేక్షించదని హెచ్చరించారు.

మీడియా ఎంటర్?టైనర్లుగా మిగలడం మినహా సాధించేది ఏముండదని తెలిపారు. పతనమైన విలువలకు ప్రాణం పోసే యత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్? జగన్‌మోహన్ రెడ్డిని ఈ శక్తులేవీ అడ్డుకోలేవని స్పష్టం చేశారు.

## వారంలో ఒకరోజు పూర్తి లాక్‌డౌన్‌కు చర్యలు : ఆరోగ్య మంత్రి మల్లాడి

యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్రంలో వారంలో ఒకరోజు పూర్తి లాక్‌డౌన్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు విలేఖర్లకు తెలిపారు .సోమవారం పుదుచ్చేరిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో లో రోజు రోజుకి కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ నివారణ చర్యల్లో భాగంగా వారంలో ఒకరోజు ఆదివారం పుదుచ్చేరి 4 రీజన్ లలో పూర్తి ఒక్కరోజు లాక్ డౌన్ విధించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆదివారం మార్కెట్లలో ఫిష్, మటన్ సెంటర్ల దగ్గర ఇటువంటి భౌతిక దూరం ,కరోనా నివారణ చర్యలు పాటించడంలేదని అందు వలననే ముఖ్యమంత్రి ,సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు .ఇప్పటివరకు 20 వేల ఏడు వందల 28 మందికి కోరం నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ప్రస్తుతం పుదుచ్చేరి నాలుగు ప్రాంతాల్లో కొత్తగా 65 పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు .22 మందిని చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు .ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఐసోలేషన్ వార్డులో కొరకు కళాశాల యాజమాన్యాలతో సమావేశమై వార్డులు ఏర్పాటు కొరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు .పారిశుధ్యం పై అధికారులు తీసుకునే చర్యలపై అధికారులతో సమావేశమై మెరుగైన పారిశుద్ధ్యం కొరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు .గవర్నర్ కిరణ్ బేడీ విడుదల చేసిన హెల్త్ బులిటెన్ పై ప్రజలను తికమకలో చేస్తున్నారన్నారు .ప్రజల వాటిని ఎవరూ నమ్మరాదని అన్నారు .నివారణ చర్యలు కొరకు అధికారులను అప్రమత్తం చేస్తూ తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## గాజువాక లో వ్యభిచార గృహంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి

*-నలుగురు అమ్మాయిలతో పాటు 6గురు విటులు ఒక కారు, 5వేలు నగదు, 6సెల్ ఫోన్లు స్వాధీనం.*

గాజువాక: నియోజకవర్గంలో ని కర్ణవాని పాలెం లో ఒక ఇంటిపై టాస్కోఫర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన ఈ దాడులలో నలుగురు అమ్మాయిలతో పాటు ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు. ఒక కారు,5వేలు నగదు, 6సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని గాజువాక పోలీసులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా టాస్కోఫర్స్ ఎస్సై కొల్లి సతీష్ మాట్లాడుతూ వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించామని వారిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలకోసం గాజువాక పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఈ దాడులలో టాస్కోఫర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్నినిర్వహించిన జివియంసి అదనపు కమిషనర్



విశాఖపట్నం : జివియంసి ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమీషనర్ ప్రోగ్రాంను అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు టోల్ ఫ్రీ నెం. 1800-4250-0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. స్వీకరించిన విజ్ఞప్తులను స్వయంగా పరిష్కరించి తగు నివేదిక సమర్పించే నిమిత్తం ఆయా విభాగాల అధికారులను/జోనల్ కమీషనర్లకు పంపించారు. ఇందులో 1వ జోన్ కు సంబందించి 01, 2వ జోన్ కు సంబందించి 02, 3వ జోన్ కు సంబందించి 02, 4వ జోన్ కు సంబందించి 04, 5వ జోన్ కు సంబందించి 01, 6వ జోన్ కు సంబందించి 03, మొత్తము 13 ఫిర్యాదులు ఫోన్ ద్వారా స్వీకరించారు.

అదనపు కమీషనర్ ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులతోను, జోనల్ కమీషనర్లతోను, మాట్లాడుతూ...

డయల్ యువర్ కమీషనర్ లో స్వీకరించిన ఫిర్యాదులతో పాటూ, స్పందన కార్యక్రమాలలో స్వీకరించిన ఫిర్యా దులు, మునిసిపల్ పరిపాలన శాఖ వెబ్ సైట్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్లు తమీమ్ అన్సారీయా, ఆర్. సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు వెంకటేశ్వర రావు, సి.సి.పి. విద్యుల్లత, పి.డి. యు.సి.డి. శ్రీనివాసరావు, సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎల్.ఎస్.జి. శాస్త్రి, అసిస్టెంట్ డైరెక్టర్, ఉద్యాన శాఖ ఎం. దామోదర రావు, డి.పి.ఓ. లక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

### భీమిలి సెంటీనియల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా

# లయన్ సత్తరవు వాయునందనరావు



భీమునిపట్నం : భీమిలి సెంటీనియల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రైవేట్ పంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతధిగా విశాఖ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉందని చెప్పారు. కరోనా కష్ట కాలంలో లయన్స్ క్లబ్ పాత్ర ఎంతో కీలకపాత్ర పోషించారని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు . లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గా లయన్ సత్తరవు వాయునందనరావు, కార్యదర్శి గా లయన్ లచ్చు బుగత గణపతిరావు,కోశాధికారిగా టి.వి.ఎస్ నాయుడు లు ప్రమాణ స్వీకారం చేశారు. ఇండక్షన్ ఆఫీసర్ గా లయన్ కె.వి రావు,ఎం.జె.ఎఫ్ కొత్తగా చేరిన లయన్ పి.ప్రకాషరావు, గనివాడ . పార్వతి లకు చేయవలసిన విధులు గురించి చెప్పారు. ఇన్సులేషన్ ఆఫీసర్ గా లయన్ బి. బాలసుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఆలీవర్ రాయ్, కె.ఎస్ ఎన్ మూర్తి, చాగంటి సుబ్బారావు కోడూరు సింహాచలం, లయన్ చిల్లా వంశీ, చిప్పాడ వెంకటేష్, ఉప్పాడ అప్పారావు,లయన్ బొండా నర్సింహ మూర్తి, చాగంటి చైతన్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అడిదం.సన్యాసిరాజు సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది.

# అంజిరెడ్డి కేరాఫ్ అధీప్‌రాజ్ గ్రీన్ అర్మీ

### వాకింగ్ ట్రాక్ ప్రారంభంలో ఎమ్మెల్యే అధీప్




పరవాడ : జివి ఎమ్ సి పరిది 79వ వార్డులో గల దేశపాత్రునిపాలెంలో ఇటీవలే స్దానిక వైసిపి సినియర్ నాయకులు కాసు అంజిరెడ్డి అద్వర్యంలో అదీప్ రాజ్ గ్రీన్ అర్మీ అనే కార్యక్రమాన్ని స్దానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతులుమీదగా ప్రారంభించిన సంగతి అందరికీ తెలిసిందే...దీంట్లో బాగంగా చెరువు గట్టును శుభ్రము చేసి పోలమాంబ సాగర్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేసారు. ఈవాకింగ్ ట్రాక్ ను అదివారము స్దానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా హజరై ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరముఅయన మాట్లడుతూ అదీప్ రాజ్ గ్రీన్ అర్మీ పేరుతో అంజిరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమనీ అన్నారు. అదీప్ రాజ్ గ్రీన్ అర్మీకి కేరాఫ్ అంజిరెడ్డి అని ఈసందర్భంగా అయన తెలిపారు. స్దానికంగా గల సమస్యలును పరిశీలించారు. జాజుల వానిపాలెం చెరువు పనులును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు, 79వ వార్డు వైసిపి అభ్యర్ది అల్లూరి రామకృష్ణం రాజు(గోపిరాజు), గుర్రం శ్రీను, పండూరి రమణ, నక్కారమణబాబు, పెందుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పైల జూనియర్ అప్పలనాయుడు, బాబురావు,బొద్దపు చిన్నారావు, శివ తథితర్లు పాల్గోన్నారు.

గురుపూర్ణిమ సందర్భంగా అన్నార్తులకు అన్నదానం చేస్తున్న సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్, మాజీ కార్పోరేటర్ వానపల్లి రవికుమార్



# ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి



గాజువాక : ప్రజలకు ఇచ్చిన హామీలను నెర్వేంచేందుకు కృషి చేస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. జీవీఎంసి 76 వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో 19.75 లక్షల రూపాయల జీవీఎంసి నిధులతో వర్షపునీటి కాలువకు వార్డు కార్పొరేటర్ అభ్యర్థి దొడ్డి రమణ అద్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డి , జోనల్ కమిషనర్ డి శ్రీధర్ లు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ తను ఎమ్మెల్యే ఐన సంవత్సర కాలంలోనే నియోజక వర్గంలో అన్ని వార్డలలో అభివృద్ధి పనులు సగానికిపైగా పూర్తి చేసినట్లు తెలిపారు. నియోజక వర్గంలో ఇంకా కొన్ని పనులు పూర్తి చేయవలసి ఉందని ఆ పనులను కూడా ఒక సంవత్సర కాలంలో శతశాతం పూర్తి చేసి నియోజకవర్గాలలో గాజువాకను ప్రధమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. దొడ్డి రమణ మాట్లాడుతూ వర్షకాలం వస్తే వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో స్థానిక ప్రజలు , వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రావడంతో అప్రాంత ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డికి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. వర్షపునీరు పోయేందుకు అనువుగా ఒక కాలువ నిర్మాణం చేయాలని కోరడంతో సానుకలంగా స్పందించిన ఎమ్మెల్యే 19 .75 లక్షల రూపాయల జీవీఎంసి నిధులను విడుదల చేశారన్నారు. పనులను పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డికి వార్డు ప్రజలందరితరుపున ప్రత్యేక కృత్ఙతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కాల సత్యనారాయణ , రంభ నారాయణమూర్తి, మంత్రి శంకర్ నారాయణ,త్రినాథ్ యాదవ్ , మార్టిపూడి పరదేశి, అండిబోయిన సన్నీ , వార చైతన్య, ఆనంద్ , గణేష్ , మురళి, అప్పలనాయుడు, జీవీఎంసి అధికారులు ఏ ఇ, డి ఇ ,గాంధీ నాగర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి



గాజువాక: జీవీఎంసీ 76 వ వార్డ్ బాబు జగజ్జీవన్ రామ్ కాలనీలో వార్డు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దొడ్డి రమణ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగజ్జీవన్ 34 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి మాజీ శాసనసభ్యులు చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. బాబుజగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడుగా, సంఘసంస్కర్తగా, అట్టడుగు ప్రజలకు ఆశాజ్యోతిగా కొనియాడారు. రాజకీయాలలో మాటతప్పని మడమ తిప్పని నాయకుడిగా పరిపాలనాదక్షుడు గా ప్రజల చేత ఆప్యాయంగా బాబుజి అని పిలిపించుకున్న ఏకైక నాయకుడు డాక్టర్ బాబు జగజ్జీవన్ గారు ఒక్కరే అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమందరం కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్ట్ పూడి పరదేశి, నక్క వెంకటరమణ , తాటికొండ జగదీష్, పిట్టా రెడ్డి, దొడ్డపు రెడ్డి అప్పల రాజు అచ్యుత్, కాకినాడ పెంట రావు, ఈశ్వర్ రావు, పెంట రావు,రమణ, కాకినాడ వెంకట రమణ, అండి బోయిన సన్నీ, గణేష్, వార చైతన్య, గురు మూర్తి, ప్రసాద్, బాబురావు, మురళి, సుధ, శివ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అమర్ కృషితో

# కశింకోటలో 100 కోట్ల అభివృద్ధి

### వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



అనకాపల్లి : కశింకోట మేజర్ పంచాయితీ కేంద్రంలో అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాధ్ కృషితో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాయంలో ప్రభుత్వ పెద్దల సహకారంతో మేజర్ పంచాయితీ కేంద్రమైన కశింకోటలో వందకోట్ల రూపాయల నిధుల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్ట గలుగుతున్నామని, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ పనుల్లో ఇప్పటికే 40 శాతం మేరకు పూర్తి అయ్యా యన్నారు. గ్రామంలో మురుగునీటి వ్యవస్దను మెరుగు పరిచేందుకు గాను, ఏడు కిలోమీటర్ల పొడువున కాల్వలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సామాజిక అవసరాల దృష్ట్యా అన్ని వసతులతో కూడిన భారీ కళ్యాన మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. చరిత్రలో నిలిచిపోయే విదంగా అర్హులైన వారికి 600 పైచిలుకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యంగా రైతుల సౌకర్యార్ధం కశింకోట - ఎదురుపర్తి నడక బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు తాము ఎల్లప్పుడు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెట్టేందుకు జగన్మోహన్‌రెడ్డి నిరంతరం దృష్టిసారించడం అభినందనీయమన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో 104, 108 సేవలు అందు బాటులోకి తేవడం మరో సారి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డిని గుర్తుచేసిందన్నారు. అనకాపల్లి నియోజవర్గంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించేలా ఎమ్మెల్యే అమర్‌నాధ్ పాటు పడుతున్నారని, ఎన్నటికి తాను జగన్, అమర్ బాటలోనే నడుస్తానని బుల్లిబాబు చెప్పారు.

# ఇసుక సరఫరా వేగవంతం చేయాలి

### జాయింట్ కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి



విశాఖపట్నం : జిల్లాలో ఇసుక సరఫరా వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టరు ఎం.వేణుగోపాలరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ఇసుక లభ్యత, వాహనాల లోడింగ్, అన్లోడింగ్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక వినియోగ దారులకు వీలైనంత వేగంగా సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వున్న వివిధ ఇసుక డిపోలలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదావరి వరదపోటు వున్నందున తూర్పు గోదావరి జిల్లా నుండి ఇసుక సరఫరా మందగించిందని, శ్రీకాకుళం నుండి వస్తున్న ఇసుకను సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇసుక తరలింపుకు వచ్చే వాహనాల వివరాలను సాండ్ ఎన్ఫోర్స్ మెంటు వారికి తెలియజేయాలని ఆదేశించారు. ఇసుక లోడింగ్ అన్ లోడింగ్ లో వున్న లోపాలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఇసుక సరఫరాలో జాప్యం లేకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్.ఇ.బి. అడిషనల్ ఎస్.పి. రాహుల్ దేవ్ సింగ్, ఉప రవాణా కమిషనర్ రాజరత్నం, భూగర్భ గనులశాఖ సహాయ సంచాలకులు బెట్కరాగినాయుడు, వెంకటేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

### భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో

# డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవం



విశాఖపట్నం : లాసన్స్ బే కాలనీ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విశాఖ పట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, విశాఖపట్నం మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విచ్చేశారు. డా.కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప మేధావి అని అతి చిన్న వయసులో ముప్పై మూడు సంవత్సరాలకే కొలకత్తా విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు గా విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశారని బెంగాల్ రాష్ట్రంలో శాసనమండలికి ఎన్నికై ఆర్థిక మంత్రిగా పనిచేశారని స్వాతంత్ర్యానంతర కాంగ్రెస్ మరియు నెహ్రూ సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ మంత్రివర్గం నుండి స్వచ్ఛందంగా వైదొలగాలని ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు రెండు జెండాలు ఇద్దరు ప్రధానులు ఉండకూడదని కాశ్మీర్ ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతిని ధిక్కరిస్తూ కాశ్మీర్ కి వెళ్లి అక్కడ అరెస్టు కాబడి జైలు లోనే అనుమానస్పదంగా మరణించడం జరిగిందని దేశంలో వారు మరణించిన జూన్ 23న బలిదాన్ దివస్‌గా పార్టీ జరుపు కుంటుందని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ హిందూ మహాసభ అధ్యక్షులుగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ పని చేశారని దేశంలో అందరికీ ఒకే చట్టం ఉండాలని భావించారని వారు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర మాట్లాడుతూ భాజపా మాతృ సంస్థ అయిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ భావాలతో వారు ప్రారంభించిన పార్టీ వాజ్ పేయి, అద్వానీ, సుందర సింగ్ బండారి లాంటి మహనీయుల కృషి తో భారతీయ జనతా పార్టీ 11 సంవత్సరాలు దేశంలో అధికారం లో ఉండి దేశ అభివృద్ధికి కృషి చేయటానికి అవకాశం కలిగిందని అన్నారు.

ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వనాధ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్‌విఎస్. ప్రకాష్‌రెడ్డి, ఎన్.సన్యాసిరావు, వల్లూరి మోహన్‌రావు, నగర కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, సూరాడ రాజు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## సాహిత్యం వారసత్వ సంపద

ఆయాకాలాల ప్రజల అనుభవాల, భావాల, అభి రుచుల, ఇష్టానిష్టాల, సుఖదుఃఖాల, భౌతిక ఆధ్యాత్మిక విషయాల సంపుటీకర ణమే సాహిత్యం. సాహిత్యంలో అంతర్భాగాలైన పదజాలం, సామెతలు, కవిత్వం ప్రతిదానిలోను ఏదో కొంత సాంస్కృతిక విశేషం లభించవచ్చు. కాలపరిణామంలో, ఆచార సంప్రదాయాల్లో, జీవన సరళిలో ఎన్నోరకాల మార్పు లు చోటుచేసుకోవచ్చు. కొన్ని పూర్తిగా పోవచ్చు. పాక్షికంగా మారవచ్చు. కొత్తవి ప్రారంభం కావచ్చు. వీటికి పరిసర ప్రాంతీయ భాషా సాహిత్య మత వ్యాపార సంబంధాల హేతువు కావచ్చు. దాడులు కావచ్చు. పాలకసంస్కృతి ఆచారాల అనుకరణలు కావచ్చు. సాహిత్యం సంస్కృతీపరిణామాల అవగాహనకు ఆధారభూతంగా ఎలా నిలుస్తుందో వైవిధ్యభరితమైన అంశాలు మచ్చుకు కొన్ని.. ఈ పిల్ల పదహారణాల తెలుగు అమ్మాయి. పిల్ల పదం ఏనాటిది? శాతవాహన కాలంనాటి గాథాసప్తశతిలో తొలిసారి కనిపిస్తుంది. అంతకుముందే జన వ్యవహారంలో నిత్యం వాడుకలో ఉన్న పదం. అంటే ఒక పదం వెనుక వేల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లే కదా. మరి పదహారణాల తెలుగు అమ్మాయి అని ఎందుకనాలి? పదిహేడు అనవచ్చు. పద్నాలుగు అనవచ్చు, 20 అణాలు అనవచ్చు కదా! నిజాం కాలంలో ఉన్న ద్రవ్య మారకం ఇది. అణా అంటే ఆరు పైసలు. 16 అణాలు అంటే 96 పైసలు. నిజాంకాలంలో 96 పైసలే రూపా యి కింద లెక్క. బ్రిటిషాంధ్రలో నూరుపైసలకు రూపాయి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ ముఖ్యమంత్రి అయినప్పుడు నిజాం రుపీ ని బ్రిటిష్ రూపాయిని సమానం చేశారు. అయితే జనంలో సెంట్ పర్సెంట్ (నూటికి నూరుశాతం) అనే దగ్గర పదహారణాలు అనే జాతీయమే వాడుకలో ఉంది. మనం 25 పైసలకు చారాణా (24 పైసలు) అనీ, 50 పైసలకు (48) ఆఠాణా, 75 పైసలకు (72) బారాణా అనీ వ్యవహారానికి వాడుతూ సర్దుకున్నాం. ఇది చరిత్రలోని ఒక పరిణామానికి సాక్ష్యం. ఈ రోజు పెళ్ళిలో మాంగల్యధారణ అన్నది ప్రధానాంశం. నిజానికి ముహూర్తం అంటే నిర్దేశిత సమయమేం కాదు. దాదాపు 40 నిమిషాలు ఉంటుంది. పురోహితులు సరిగ్గా మధ్యలో ముహూర్తం పెడతారు. మన సౌకర్యం కోసం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. ఆ మూహూర్తంలో కూడా జిలకర బెల్లం పెట్టడమే ముఖ్యం తప్ప మాంగల్యధారణ కాదు. జిలకరబెల్లం, సప్తపది, హోమం ఇవే పెళ్ళికి మూలం. మాంగల్యధారణ తర్వాత కాలంలో వచ్చిన దాక్షిణాత్య ఆచారం. దీని కాలం ఎప్పటిది అని తెలుసుకోవాలంటే సాహిత్యాధారం తోడ్పడుతుంది. తిక్కన.. ఉత్తరాభిమన్యుల వివాహంలో తలంబ్రాలు పోసుకోవడాన్ని వర్ణించాడే తప్ప మాంగల్యధారణ వర్ణించలేదు. పోతన భాగవతంలో..

మ్రింగెడువాడు విభుండని  
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్  
మ్రింగుమనె సర్వమంగళ  
మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో (భాగవతం.8-241)

అని స్పష్టంగా మాంగల్యధారణను చెప్పాడు. అంటే తిక్కన నాటికి లేకుండా పోతనకాలం నాటికి మధ్యలో ఈ ఆచారం వచ్చి స్థిరపడిందని ఊహించాలి. లలితా సహస్రనామం అందరూ పారాయణం చేస్తుంటారు. బ్రహ్మాండ పురాణం ఉత్తరభాగంలో లలితాసహస్రనామం ఉంది. అందులో కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా అని వస్తుంది. శివుడు పార్వతిమెడలో మంగళసూత్రం కట్టాడని భావం. బ్రహ్మాండ పురాణం గుప్తుల కాలంలో రాయబడిందంటారు. మరి అప్పుడు ఈ ఆచారం ఉందా? ఉన్నట్లు ఆధారాలు లేవు. ఎవరో భక్తాగ్రగణ్యుడు లలితాసహస్ర నామాన్ని బ్రహ్మాండపురాణంలో దూర్చడంలో విజయం సాధించాడు. ఇలా మధ్యలో చేర్చిన వాటిని ప్రక్షిప్తాలని పిలుస్తాం.

చేతులారంగ శివుని పూజింపడేని -  
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని  
దయయు సత్యంబు లోనుగా దలపడేని  
కలుగ నేటికి తల్లుల కడుపు చేటు..

అందరికీ తెలిసిన పోతన పద్యం ఇది. సాధారణంగా అర్థం చెప్పేస్తారు. కాని ఇందులో ఒక సంస్కృతీ విశేషాన్ని పోతన నిక్షిప్తం చేశాడని గమనిస్తే మరింత ఆనందం కలుగుతుంది. అభిషేకప్రియుడు శివుడు, కనుక శివాలయానికి వెళ్ళి శివుని నెత్తి మీద నీళ్లు పోయాలి. ఎందుకు గరళతాపహరణార్థం. అది చేతులారంగ చేయాల్సిందే. విష్ణువు సంకీర్తన ప్రియుడు. అందుకే విష్ణువుకు సుప్రభాతాలు, సహస్రనామాదులు ఉంటాయి. అవన్నీ నోరు నొవ్వంగ చేయాల్సిందే. చేతులారంగ శివుని పూజింపడేని.. నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని.. అంటే అభిషేకప్రియుడు శివుడు. సంకీర్తన ప్రియుడు విష్ణువు. నమస్కారప్రియుడు సూర్యుడు. స్మరణప్రియుడు దత్తాత్రేయుడు. ఆయాదేవతల అభీష్టాల ప్రకారం పూజిస్తేనే మన అభీష్టాలు నెరవేరుతాయి.

## అనంతగిరిలో జరుగుతున్న వారపు సంతను అడ్డుకుంటున్న కమిటీ ప్రతినిధుల బృందం



అనంతగిరి : మండల కేంద్రంలో జరుగుతున్న కరోనా కారణంగా సంత జరగకుండా చెదరగొట్టడం జరిగింది. ఇంకో నెల రోజుల వరకు సంతకు రావద్దని సౌకరులను చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతగిరి తహసీల్దార్ శ్రీ వెంకట వరప్రసాద్. అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మణరావు మరియు గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు వర్తక సంఘం నాయకులు. సాయి రామ్. శ్రీను. చందు. వెంకటేష్ మన్మధ.తిరుపతి మురళి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిరాడంబరంగా జరిగాయి.ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



సుదర్ఘీ కాలంపాటు దేశభద్రత కోసం సైనికునిగా సేవలందించిన మాధవధార ప్రాంతానికి చెందిన విశ్రాంత సైనికుడు పైడి రామచంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పైడి రామచంద్రరావు మాధవధార తదితర ప్రాంతాలలో సంఘ సేవకునిగా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సంతాపసభలో మాధవధార ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు సనపల బంగారురాజు, టీడీపీ నాయకులు సనపల పాండురంగారావు, 50వవార్డు వైకాపా అభ్యర్థి వావిలపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్, 50వవార్డు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్ధి పూజారి మధుసూదనరావు, టీడీపీ అభ్యర్థి సనపల వర ప్రసాద్, టూటౌన్ ట్రాఫిక్ సీఐ పైడి రంగనాథ్, సనపల వెంకటరావు, బంధుమిత్రులు, పలువురు వక్తలు పైడి రామచంద్రరావు సేవలను కొనియాడారు.

# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

## నలుగురు మావోయిస్టులు హతం



ఒడిస్సా క్రైమ్ : ఒడిశాలోని మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు హతమయ్యారు. కంధమాల్ జిల్లా సిర్లా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో భారీ ఎత్తున ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోంది. సిర్లా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు నిఘా వర్గాల సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. డిస్ట్రిక్ట్ వలంటీరీ ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తంగా తుమిడిబంద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్లా గ్రామ సమీపంలో అడవుల్లో కూబింగ్ నిర్వహించింది.

ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కూబింగ్ నిర్వహిస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. ఎదురుకాల్పులు జరిపారు. గంటపాటు జరిగిన ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా.. పలువురు తప్పించుకున్నారు. పోలీసుల కాల్పుల్లో మృతిచెందినవారిలో ఓ మహిళా నక్సలైట్ కూడా ఉంది. ఘటనా స్థలంలో ఇన్సాస్ రైఫిల్, నాటు తుపాకీ, వివిధ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టులపై గతంలో ప్రభుత్వం రివార్డు ప్రకటించినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడయ్యింది. వీరు బంశధార-ఘుముసారా-నాగావళి (బీజీఎన్) డివిజన్‌కు చెందిన మావోయిస్టులగా గుర్తించారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమైనట్టు తెలుస్తోంది.

# భారత ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ములగాడ: జనసేన పార్టీ బలపర్చిన 62వ వార్డు బిజిపి అభ్యర్థి ములకలపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ భారత దేశ మాజీ ఉప ప్రధానమంత్రి కీ.శే. శ్రీ బాబు జగ్జీవన్ రామ్ 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 62వ వార్డ్ ప్రకాశనగర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుక్కా శ్రీనివాసరెడ్డి(ఆర్ ఎస్ ఎస్) పాల్గొని మాట్లాడుతూ డా. అంబేద్కర్ భారతదేశానికి బలమైన రాజ్యాంగాన్ని అందిస్తే, అందులో దళితులకు లిఖించబడిన హక్కులను అమల్లోకి తీసుకుని వచ్చి ఆ ఫలాలను దళిత సోదరీ సోదరులకు అందించిన ఘనత బాబు జగ్జీవన్ రామ్ కు దక్కుతుంది అన్నారు. ఆయన దేశానికి ముఖ్యంగా దళితులకు చేసిన సేవలను నేటి తరాలకు తెలియజేసే బాధ్యతలను దళిత సంఘాల నాయుకులు ఆదర్శంగా తీసుకోని అందరికీ వివరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ అరుంధతి సంక్షేమ సంఘం నాయుకులు మోటూరి ఎల్లాజీ రావు, యల్లబిల్లి నరసింగరావు, గజ్జలపు అప్పలస్వామి, ఏడిద నూకరాజు, యల్లబిల్లి కనకేశ్వర రావు, యల్లబిల్లి రాజు, ములగాడ త్రినాధ రావు,తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు లేని బాలికపై కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు బాలిక గర్భం దాల్చడంతో వెలుగులోకి వచ్చిన వైనం



యలమంచిలి క్రైమ్ : విశాఖ జిల్లాలో దారుణ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది తల్లిదండ్రులు లేని ఓ బాలికను మాయమాటలు చెప్పి ముగ్గరు వ్యక్తులు కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడ్డారు. ఇటీవల ఆ బాలిక అనారోగ్యానికి గురి కావడంతో వైద్య పరీక్షలు నిర్వహించిన ఆమె గర్భం దాల్చినట్లు గుర్తించారు. ఎలమంచిలి మండలం కొత్తలి గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో నాన్నమ్మ తాతయ్య ల వద్ద ఉంటుంది. తుంగ తరగతితో చదువు ఆపేసిన ఆ బాలికను నానమ్మ తాతయ్య వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన ముగ్గరు వ్యక్తులు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆ బాలికను నానమ్మ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఐదు నెలల గర్భవతి గా చెప్పారు. ఈమేరకు నిందితులు ఓ కార్పెంటర్.. భవన నిర్మాణ కార్మికుడు... దినసరి కూలీగా గుర్తించారు. బాలికను అనకాపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు పంపించి వైద్య పరీక్షలు నిర్వహించారు...

## కవి సమయం

### చిరస్మరణీయుడు

ఇదేం కర్మమో!  
సృష్టి మర్మమో!  
మట్టైపోయావు  
మేధావియైన  
ఓ మహామనిషి  
నీ జ్ఞాపకాల సంతతి మిగిల్చిపోయావు  
ఓ మహామనిషి-నీవు చిరస్మరణీయుడవు ...॥ఇదేం॥  
సిరి-పురం సంతతిలో స్వామీ!...అప్పల నామధేయుడవై జన్మించె  
సరాళి-పురంన ఉపాధ్యాయుడవై,  
విజ్ఞాన సంపద విత్తనాలు  
విస్తీరణముగా వెదజల్లినావు  
దేశ-దేశాలలో నీ శిష్యులు  
మహావృక్షాలై - ఫల సంపదలు అందిస్తుంటే;  
అందుకోలేనంత సుదూర తీరాలకు ఎగసినావు  
ఓ మహామనిషి- నీవు చిరస్మరణీయుడవు... ॥ఇదేం॥  
'కన్నీటి పర్వం' అంటే ఏమిటో!  
నీ మరణం రోజు తెల్పావు  
'తీపి-చేదు జ్ఞాపకాలు'  
నీ కడుమ రోజు తెల్పావు  
నన్నుమైమరచి మీ జీవితాలు  
వరవడి దిద్దుకొమ్మని  
నీ ముక్కడుము రోజు తెల్పావు  
ఓ మహామనిషి-నీవు చిరస్మరణీయుడవు... ॥ఇదేం॥  
ఎంత వారైనా!... ఎందులోనైనా!  
నీకు సాటి లేరు ఎవ్వరు!  
నిన్ను సలాం కొట్టవల్సిందే!  
అలాంటిది... మట్టైపోయావు  
ఓ మహామనిషి - నీవు చిరస్మరణీయుడవు... ॥ఇదేం॥

...కవితా రచన  
యల్.సిద్ధూ

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి : విదియ ఉ.8.58; శ్రవణం రా.12.41; ఉ.శే.వ.5.42వ; తె.వ.4.53ల. మంగళవారం 07-07-2020

**మేషం:** నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదు ర్కొనక తప్పదు. **వృషభం** : రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది. **మిధునం** :వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. **సింహం** : బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది. **కన్య** :కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. **తుల** : ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. **వృశ్చికం** : స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేష జాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు. **ధనుస్సు** : ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. **మకరం** : వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. **కుంభం** : ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బందు లంతగా ఉండవు. ఉపాధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కా రమవుతాయి. **మీనం** : బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుం బీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారు తుంది. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి.

## లబ్ధిదారులకు న్యాయం చేయాలి




ములగాడ: ఇల్లు కోసం నగదు కట్టిన లబ్ధిదారులకు న్యాయం చెయ్యాలని తేదేపా శ్రేణులు వైకాపా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతం ములగాడ టిట్ కో హౌసింగ్ సముదాయం నిర్మాణం వద్ద వార్డ్ తేదేపా కార్పొరేటర్ అభ్యర్థులు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 60వవార్డ్ తేదేపా కార్పొరేటర్ అభ్యర్థి పెతకంశెట్టి శ్యామ్ మాట్లాడుతూ గత తేదేపా ప్రభుత్వం హయాంలో ఇంటికోసం ఒక్కొక్క లబ్ధిదారుడు లక్షల రూపాయలు కట్టారని, అచ్చెన్నాయుడు తోట, ములగాడ వద్ద టిట్ కో సంస్థ ఇల్లు నిర్మాణం కూడా చేపట్టి లబ్ధిదారులకు ప్లాట్ మంజూరు చేస్తూ పత్రాలు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. అయితే 80 శాతం పూర్తి అయిన ఇళ్లను ఇప్పుడు వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిర్మాణము చేయకుండా ఆపడం దారుణమని అన్నారు. అప్పుచేసి లబ్ధిదారులు కట్టారని, వారికి న్యాయం చేయాలని లేనియెడల తేదేపా పోరాటాన్ని ఉదృతం చేస్తుందని హెచ్చిరించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెదేపా వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థులు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, జోజిబాబు, లాలం లావణ్యలతో పాటు తేదేపా నాయకులు రామ్మోహన్ నాయుడు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వెంకన్నపాలెం షిరిడి సాయి ఆలయంలో గురుపౌర్ణమి పూజలు





- షిరిడి సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు - వెంకన్నపాలెం షిరిడి సాయి ఆలయం వద్ద భక్తుల సందడి - షిరిడిసాయి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ ఎండి వి.సన్యాసినాయుడు

చోడవరం : మండలంలోని వెంకన్నపాలెం కాశీ విశ్వేశ్వర స్వామి ప్రాంగణంలో గల షిరిడి సాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. పూజా కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ యం.డి.వి. సన్యాసినాయుడు, సీఈవో ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరుడు, ఫ్యాక్టరీ ఏవో పప్పుల రమణమూర్తి తదితరులు పాల్గొనగా ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, రమణ మూర్తి, సతీష్ లు పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకము, హెూమము, విశేష పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చల్లపల్లి బాబ్జి, అకౌంట్స్ ఆఫీసర్ దో హోలీ, ముచ్చు పల్లి వెంకటరమణ, సాయి సేవకులు కాశీం, లక్ష్మీనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



దేవరాపల్లి: గురుపౌర్ణమి సందర్భంగా దేవరాపల్లి మండలంలో పలు సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబాను ప్రత్యేక అభిషేకం నిర్వహించి సుంద రంగా అలం కరించారు. పలు చోట్ల గులాబి పూలతో అభిషేకం చేశారు. కొన్ని గ్రామాల్లో రామాలయాలలో కూడా గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. అన్ని చోట్ల ఆలయాల్లో భక్తులు అతి కొద్ది మంది పాల్గొని పూజలు అభిషేకాలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ఆలయం లో కూడా పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు గురుపూజోత్సవం ప్రాధాన్య టతను ఆవశ్యకత గురించి భక్తులకు వివరించారు. అదే విధంగా వ్యాస పౌర్ణమి కూడా జరుపుకున్నారు. లలితా సహస్రనామం విష్ణు సహస్రనామం మణిద్వీప వర్ణన పారాయణ మహిళలు నిర్వహించారు.

## పింగళి వెంకయ్యకు

# భారతరత్న ప్రకటించాలి



దేవరాపల్లి : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్థంతి సందర్భంగా ఇవేమా ఘనమైన నివాళులు అర్పింస్తున్నాము. ఇలాంటి మహానీయునికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత వచ్చిన ప్రభుత్వాలు 'భారతరత్న' తో గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత్ గడ్డపై త్రివర్ణ పతాకం రెప రెపలాడు తుంటే మన భరతమాత ముసి ముసి నవ్వులు నవ్వుతుందంటే ఆ ఘనత మన పింగళిదే! ఇలాంటి వ్యక్తి చిరస్మరణీయుడు. అందుకే ప్రస్తుతం ఉన్న భారత ప్రభుత్వ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనకు భారత రత్న బిరుదు పురస్కారం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి సత్యవాడ దుర్గాప్రసాద్, కోనూరు సతీష్ శర్మ, అడవి వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు జి.ఎస్.ప్రభాకర్‌రావు, సంయుక్త కార్యదర్శి వడ్డాది ఉదయ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# కరపత్రం ఆవిష్కరించిన విల్లూరి భాస్కరావు



విశాఖపట్నం : కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలు పై విఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మాజీ వైసిపి యూత్ అధ్యక్షుడు విల్లురి భాస్కర్ రావు కర పత్రికను ఆవిష్కరించారు. 35 వార్డు పరిధిలో వేలంపేట తమ కార్యాలయంలో కరోన కేసులు అధికశాతం నమోదు కావడంతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ... కోవిడ్ 19 వైరస్ వలన ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాని బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం బుజ్జి, నాయన శ్రీనివాస్, రూపా, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాల పంపిణీ

# మరోసారి వాయిదా

## - నిరాశపడిన లబ్ధిదారులు

దేవరాపల్లి : దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8వ తేదీన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయాలని నిర్ణయించిన సీఎం జగన్ అర్థాంతరంగా ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని మరోసారి వాయిదా వేశారు. గతంలోనూ ఒకసారి ఈ ప్రక్రియ వాయిదా పడగా.. మరోసారి వాయిదా పడడం నిరాశకు గురిచేస్తోంది.ఎల్లుండి వైఎస్ఆర్ జయంతి కావడంతో తమకు ఇళ్ల పట్టాలు పంపిణీ అవుతాయని పేదలు ఆశపడ్డారు. అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కానీ ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి బాగా పెరిగిన నేపథ్యంలో మరోసారి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈనెల 15వ తేదీన ఈ పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటున్నట్లు సీఎం ప్రకటించారు.

## కేజీబీవీలో

# ఆరో తరగతి ప్రవేశానికి ఆహ్వానం



దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ పరిధి బేతపూడి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రత్యేక అధికారిణి ఎం. విజయ తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగి ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవా లన్నారు. దరఖాస్తులను నేరుగా కేజీబీవీలో అందజేయాలన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎస్ఓ పేర్కొన్నారు.



దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేశ్‌కుమార్ ఆదేశాల మేరకు 38వవార్డు తెలుగు దేశం పార్టీ నాయకులు అధ్యక్షులు గోడి నరసింహాచారి ఆధ్వర్యంలో ప్రభుత్వ గృహాలు గురించి 25 వేల రూపాయల డిడీలు తీసిన వారందరూ తెలుగుదేశం పార్టీ ఆఫీసులో నిరసన తెలుపుతూ లబ్దిదారులు అందరూ డిమాండ్ చేస్తున్నారు.

# గ్యాస్ గొడౌన్ ప్రారంభం

అరకులోయ : డుంబ్రిగుడ మండల కేంద్రంలో జిసిసి గ్యాస్ గొడౌన్‌ను సోమవారం ప్రారంభించారు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరకు శాసనసభ సభ్యులు పాల్గొన్న మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులు పడుతున్న ఇటువంటి ఇబ్బందులు ఉద్దేశించి మాట్లాడారు గిరిజన ప్రాంతంలో గతంలో అందుబాటులో గ్యాస్ గోడౌన్ గిరిజన ప్రాంతంలో లేక పోవడం చాలా ఇబ్బందికరంగా ఉండేది వంటచెరకు లు వర్షాకాలంలో దొరక్కపోవడం వల్ల ఆడపడుచులు వంట చేయాలంటే చాలా ఇబ్బంది పడే వారు ఇప్పుడు మన ప్రాంతంలో మనకు దగ్గరగా గ్యాస్ గో డాన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం చాలా గర్వకారణమన్నారు మన ప్రాంతంలో వినియోగ దారులు ప్రతి ఒక్కరు ఉపయోగించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అంతేకాకుండా కొంత మంది లబ్ధిదారులకు పొయ్యికూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జిసిసి డి.ఎం.పార్వతమ్మ. జిసిసి మేనేజర్ సింహాచలం సూపర్డెంట్ ఓల్డ్ ఏసి గా సి అకౌంటెంట్ జగన్నాధ రావు సిబ్బంది ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం

# ఆంధ్రాలో అట్రాసిటీ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బాబు జగజీవన్ రావు 34వ వర్ధంతి**



నర్సీపట్నం : సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల ప్రకారం ఆంధ్రాలో అట్రాసిటీ కి పాల్పడిన నిందితులను ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి యమ్.అప్పల రాజు డిమాండ్ చేశారు .సోమవారం నర్సీపట్నం డివిజన్ కేంద్రంలో బాబు జగజ్జీవన్ రామ్ 34వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్మికులను, సంపద సృష్టి కర్తలను, దళిత వర్గాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడాన్ని తాము ఆహ్వానిస్తు న్నామని అన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించి దోషు లను అరెస్టు చేయాలన్నారు.

2020 ఫిబ్రవరి నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర పోలీసు శాఖ అమలు చేయాలని కోరుతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు డొక్కా చినరాజుబాబు, నర్సీపట్నం మండల అధ్యక్షులు యాదగిరి దాసు,డీ హెచ్ పి ఎస్ నాయకులు మర్రా నాగరాజు, కళ్యాణం, పొన్నపు శేఖరు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హరనాధుని155వ జయంతి



ఆశ్రమ సన్నిధిలో వేంచేసి ఉన్న శ్రీ కుసుమ హరనాథ దివ్యమంగళ మూర్తులు

విశాఖపట్నం : దువ్వాడ రాజీవ్ నగర్ శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో శ్రీహరనాధుని 155 వజయంతి శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమం కమిటీ వారి ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా ఆశ్రమ ప్రాంగణంలో దివ్య సన్నిధిలో వేంచేసి యున్న శ్రీ కుసుమ హరనాథ్ లకు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించడమైనది. అనంతరం సామూహికంగా భక్తులు షోడ శాక్షరి నామ సంకీర్తన మధురంగా ఆలపించారు. శ్రీహర నాధుని అవతార విశిష్టత పై ప్రవచనం చేసినారు. తదుపరి నివేదన నీరాజనం మంత్ర పుష్పము భక్తిశ్రద్ధలతో సమర్పించడమైనది. ఈ కార్య క్రమంలో శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమ కమిటీ అధ్యక్షులు బివి బాబాజీ కార్యదర్శి ఆర్ వి ఎస్ రమేష్ సంయుక్త కార్యదర్శి కె.మంగరాజు కోశాధికారి ఎస్.అన్నాజీరావు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సంస్థ మీడియా ఇంచార్జ్ ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు పరిమిత సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదమును అన్న ప్రసాదము అందజేశాము.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను పరామర్శించిన ఎంపీ మాధవి



బాలికలతో మాట్లాడుతున్న ఎంపి

కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు అరకు ఎంపి గొడ్డేటి మాధవి పరామర్శించి అండగా నిలిచారు. కొయ్యూరు పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని షేక్ అబ్దుల్‌ఖాన్ కుమార్తె జరీనాబేగం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని పరిస్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపి, బాలిక ఇంటి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఆమె భర్త భర్త శివప్రసాద్, సోదరుడు మహేష్, వైకాపా నాయకులు ఉన్నారు.

## కరోనా పాజిటివ్

# గ్రామాల్లో డిఎల్‌పిఓ పర్యటన



కొత్తమల్లంపేట గ్రామాలను సందర్శిస్తున్న దృశ్యం

గొలుగొండ : కరోనా పాజిటివ్ వచ్చిన కొత్తమల్లంపేట, లింగంపేట గ్రామాల్లో సోమవారం నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారిణి శిరిషారాణి పర్యటించారు. కరోనా వచ్చిన ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ పనులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై నారాయణరావు, ఈవోపిఆర్‌డి లాలం సీతయ్య, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్రకుమార్, శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవనరావ్ వర్ధంతి



దేవరాపల్లి : డాక్టర్ బాబూ జగ్జీవరావ్ 34వ వర్ధంతి కార్యక్రమం మండలంలోని పలు చోట్ల జరిగింది. దేవరాపల్లి, ఎం. అలమండ, కలిగొట్ల గ్రామాల్లో సోమవారం ఆయన విగ్రహానికి పలువురు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా దళిత సంఘాల నాయ కులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశం కోసం జరిగిన పోరా టంలో పాల్గొన్నారు అని గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరుపున దేశానికి ఉప ప్రధాని అయి బడుగుల ఉన్నతికై పాటుపడ్డరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయ కులు కంటిపాము వెంకట రమణ, సముద్రం, చిన మహాలక్ష్మి, సత్య నారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు స్థలాలు పంపిణిలో న్యాయం చేయండి



అచ్యుతాపురం : ఇల్లు స్థలాలు పంపిణిలో అర్హులైన తమకు న్యాయం చేయాలని మండలంలో చోడపల్లి పంచాయితి శివారు మోసయ్యపేట గ్రామస్తులు తహ శీల్దార్ నారాయణ రావుకు విన్న వించారు. సోమవారం మోసయ్య పేట గ్రామ స్తులు అర్హులైన తమకు ఇంటి పట్టాలు పంపిణి చేయాలని ధర్నా నిర్వహించి తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. తమ పేర్లను అన్యాయంగా తొలగించారని, గ్రామంలో విచారణ జరిపి అర్హులైన తమకు ఇల్లు స్థలాలు పంపిణి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలిరాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నాడు-నేడు ద్వారా వంద శాతం అంగన్వాడీకి శాశ్వత భవనాలు

**- నర్సీపట్నం డివిజన్ లో పర్యటించిన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీతామహాలక్ష్మి**

**- రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో ఏజెన్సీలో స్థల సమస్య తీరుతుందన్న పీడీ**



నర్సీపట్నం : అంగన్వాడి భవనాలు ఇకపై నాడు-నేడు కార్యక్రమం ద్వారా పక్కా భవనాలుగా అందుబాటులోకి వస్తాయని విశాఖపట్నం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి అన్నారు. నర్సీపట్నం డివిజన్ లో ఆమె పర్యటన చేశారు .గత నాలుగు నెలలుగా లబ్ధిదారులకు టేక్ హెూమ్ రేషన్ పేరుతో 25,898 మంది గర్భిణీ స్త్రీలకు,55,724 మంది బాలింతలకు నెలకు మూడు కేజీల బియ్యం ఒక కేజీ పప్పు అర కేజీ నూనె 25 గుడ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచనలు చేశామన్నారు. రక్తహీనత నివారణకై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. జిల్లాలో 4,957 కేంద్రాలు లో 1,753 కేంద్రాలు కే సొంత భవనాలు ఉన్నాయనీ, 905 కేంద్రాలు పాఠశాలలు,అద్దె భవనాల్లోనూ, 248 కేంద్రాలు రెంట్ ఫ్రీ భవనాలు లో నడుస్తు న్నాయి అన్నారు. 1085 కేంద్రాలు నిర్మాణం లో వివిధ దశల్లో ఉన్నాయి అన్నారు. 2,248 ప్రైవేటు బిల్డింగ్ లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు ఇకపై నూతన భవనాలు వస్తాయని అన్నారు. ప్రస్తుతం అంగన్వాడీ నూతన భవనాలు, సివిల్ వర్క్ పైనే దృష్టి సారించామన్నారు. బాల్య వివాహాల పై తమ సిడిపివో లు నిర్విరామంగా పని చేస్తు న్నారన్నారు. తల్లిదండ్రులు ఈ విషయమై అవగాహన పెంచు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశాఖ ఏజెన్సీ లో నూతన అంగన్వాడీ భవనాలకు స్థలాల సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో త్వరలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా అంగనవాడి భవనాల రూపురేఖలు మారిపోతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో నర్సీపట్నం సీడీపీఓ కార్యాలయం అందుబాటులో కి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు సిడిపిఓ రమణి, సూపర్వైజర్లు ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఆంధ్రాలో అట్రాసిటీ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి.

# శాకాంభరి అలంకారంలో రత్నగిరి అమ్మవార్లు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ పౌర్ణమి పర్వ దినం సందర్భంగా రత్నగిరి క్షేత్ర రక్షకులుగా పూజలు అందుకుంటున్న శ్రీ వనదుర్గమ్మ,శ్రీ కనక దుర్గమ్మ మరియు గ్రామ దేవతగా పూజలు అందుకుంటున్న శ్రీ నేరేళ్ళమ్మ తల్లి అమ్మవారు శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. అమ్మవార్ల పలు రకాలైన కూరగాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు అమ్మవార్లను దర్శించారు.ప్రతీ సంవత్సరం ఆషాడ మాసం పౌర్ణమి రోజున అమ్మవార్లను శాకాంబరి రూపంలో అలంకరించడం వలన సరైన సమంలో వర్షములు పడి ప్రజలు సుఖ సంతోషములతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.





# ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు కుంబా రవిబాబు



అనంతగిరి : మండలంలోని కొత్తూరు పంచాయతీ కొత్తూరు గ్రామంలోని గిరిజనులకు మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ రాష్ట్ర యస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబా రవిబాబు నిఅత్యావసర సరుకులు 200 మందికి పంపిణీ చేశారు.

అనంతరం ఆయన గిరిజనులను ద్దేశించి మాట్లాడుతూ కరోనా నేపద్యం లోని ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యారని తనవంతు సాయంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చామన్నారు. అలాగే ప్రభుత్వం జీసీసి ద్వారా ఉచిత బియ్యం అందజేసారన్నారు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం లో ముందుం దన్నారు ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు,

# పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి


- పశు వైద్యశాల ఏడి చిన్నంనాయుడు

చోడవరం : ఇంటి వద్ద కుక్కలు పెంచుతున్న యజమానులు వాటికి తప్పనిసరిగా సకాలంలో యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి అని చోడవరం పశు వైద్యశాల ఏడి చిన్న నాయుడు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా సోమవారం 50 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద కుక్కలను పెంచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే వాటివల్ల మనుషులకు సోకే జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గవరవరం పశువైద్యాధికారి టి ప్రశాంత్ కుమార్, వడ్డాది పశు వైద్యాధికారి శివ కుమార్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నా పశు వైద్య అధికారులు

# గొలుగొండ మండలంలో మరో కరోనా పాజిటివ్ కేసు



లింగంపేట గ్రామంలో వివరాలు సేకరిస్తున్న కేడిపేట పోలీసు సిబ్బంది

గొలుగొండ : గొలుగొండ మండలంలో మరో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. లింగంపేట గ్రామానికి చెందిన మరో వ్యక్తికి కూడా కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ యువకుడు గత కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ రెండు రోజుల క్రితం స్వగ్రామమైన లింగంపేట వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇతన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా కరోనా సోకినట్లు ఆదివారం నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా తనతో పాటుగా సెకండ్ కాంటాక్ట్‌లో ఉన్న మరో పది మందిని సోమవారం ఉదయం పరీక్షలకు పంపించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కాగా ఈ యువకునితో పాటు మరొక యువకుడు కూడా హైదరాబాద్ నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యక్తిని కూడా సోమవారం వైద్య పరీక్షలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. లింగంపేట గ్రామంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, కేడిపేట ఎస్సై భీమరాజు ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించి గ్రామంలో ఎవరు బయటకు రాకుండా ఆ ప్రాంతాన్ని కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు.

## తూర్పు నౌకాదళంలో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులకు

# నిత్యావసర సరుకులు పంపిణీ



విశాఖపట్నం : ఐఎన్‌సి క్యాజువల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వంద మందికి దినసరి వేతన కూలీలుగా పని చేస్తున్న కార్మికులకు నిత్యావసర సరుకులు గుర్తింపు పొందిన యూనియన్ చేతుల మీదగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కరోనా నేపథ్యంలో లాక్ డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన నేవల్ బేస్, ఎన్.ఏ.డి, బి.వి.యార్డ్, కళింగ, సిటీ డబ్ల్యూ, డాక్ యార్డ్ వివిధ డిపార్ట్మెంట్లో సంబంధించిన దినసరి కూలీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. నాగేశ్వరరావు, అధ్యక్షులు పి.వి.రమణ, ఇఎన్‌సి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.ఎం.మౌలాలి, ఇఎన్‌సి ఎంప్లాయిస్ యూనియన్ సబ్బం కిరణ్ కుమార్, గంట అంబేద్కర్ పాల్గొని వీరందరికీ కూడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఐఎన్‌సి క్యాజువల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులు యమ్.సంతోష్ కుమార్, డి.మురళీకృష్ణ, కోశాధికారి సిహెచ్.నాగరాజు, ఐ.సురేష్ కుమార్, జి.ఎల్లాజీరావు పాల్గొన్నారు.

# మన్యం ప్రాంతంలో వైద్య సేవలు విస్తృతంగా చేసేందుకు 104, 108 వాహనాలు ప్రారంభం

**వాహనాలను ప్రారంభించిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి**



104, 108 వాహనాలను ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు : మన్యం ప్రాంతంలో వైద్య సేవలను విస్తృతం చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి 104, 108 వాహనాలను ప్రారంభించారని అరకు ఎంపి గొడ్డేటి మాధవి అన్నారు. కొయ్యూరు మండల పరిషత్ కార్యా లయం వద్ద కొయ్యూరు, జికెవీధి, చింతపల్లి మండలాలకు సంబంధించిన 104, 108 వాహనాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి పెట్టారన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల పట్ల స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ, తాను ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని చెప్పారు. ఈ 104, 108 వాహనాల డ్రైవర్లు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపి భర్త శివప్రసాద్, సోదరుడు గొడ్డేటి మహేష్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వారా నూకరాజు, జిల్లా కార్యదర్శి జల్లి బాబులు, మంప ఎంపిటిసి అభ్యర్థి బడుగు రమేష్, నాయకులు అప్పనవెంకటరమణ, పిహెచ్‌సిల వైద్యాధికారులు శ్యామల,కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 8న తుమ్మపాల రైతులకు బకాయిలు చెల్లింపు




అనకాపల్లి : ఈనెల 8న రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన, రైతులకు బకాయులు చెల్లించడం జరుగుతుందని సుగర్ ప్యాక్టరీ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించిన సందర్భంగా వెంకుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన, కార్యక్రమంలో రైతులకు చెక్కులు పంపిణీ అందజేయం జరుగుతుందన్నారు. 2018, 2019 సంవత్సరంలో 16 టున్నుల చెరుకు సరఫరా చేసిన 1305 రైతులకు నాలుగు కోట్ల 63 లక్షలు రూపాయలు బకాయిలు చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే తుమ్మపాల చోడవరం ఫ్యాక్టరీకి సరఫరా చేసిన 300 మంది రైతులకు పది లక్షల రూపాయలు బకాయిలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాధ్ చేసిన కృషి వలన నిధులు మంజూరయ్యాయన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హమీల మేరకు రైతుల బకాయిలు చెల్లింపుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో జూలై 8న ముఖ్యమంత్రికి పాలాభిషేకం చేయడం జరుగుతుందన్నారు. తుమ్మపాల సుగర్ ప్యాక్టరీకి మంచిరోజు రానున్నాయన్నారు. సహకార రంగ ఫ్యాక్టరీల కోసం అధ్యయన కమిటీ వేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొర్లి సూరిబాబు, జగన్ గొల్లవిల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా యానిమేటర్స్ జీతాలు పెంపుపై హర్షం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్ధానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్స్ జీతాలు పెంపు విషయంలో పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి కి అదేవిధంగా ప్రత్తిపాడు శాసనసభ్యులు పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ కి అభినందనలు తెలియచేస్తూ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా యానిమేటర్స్ పెండ్యాల. అనంతలక్ష్మి మరియు ఉచ్చుల.లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డ్వాక్రా యానిమేటర్స్ యొక్క సమస్యలు పట్టించుకోలేదని,గతంలో పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి మా గోడు విని మా సమస్యలను తెలుసుకుని మాకు పది వేల రూపాయలు జీతాన్ని పెంచి మా కుటుంబాల ను ఆదుకున్నారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దారా.వెంకటరమణ, బొబ్బరాడ.సత్యవరప్రసాద్, దడాల. సతీష్, బొబ్బిలి.వెంకన్నబాబు,కొండి.ప్రకాష్, బొమ్మిడి. సత్తిబాబు,అల్లాడ. సూరిబాబు,చామంతి. శ్రీనివాస్, చోడవరపు. సూర్య, సోమ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి 'టెలీ-స్పందన'

## - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్.



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు 'టెలీ-స్పందన' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్. సోమవారం నిర్వహించారు. 'టెలీ-స్పందన' కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీగారు, జిల్లా పోలీసు కార్యాలయంలో 08922276163 ద్వారా 06 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ-కరోనా వ్యాధి వ్యాప్తి కారణంగా ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంను తాత్కాలికంగా నిలుపుదల చేసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకుగాను ప్రతీ సోమవారం 'టెలీ-స్పందన' నిర్వహిస్తున్నా మన్నారు. కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న కారణంగాను, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, టెలి స్పందన కార్యక్రమాన్నినిర్వహించి, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఇకపై ప్రజలెవ్వరూ సోమవారం నాడు ఎస్పీ కార్యాలయానికి రానవసరం లేదని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలనుకొనే వారు ఇకపై ప్రతీ సోమవారం ఉదయం 10-30 గం။ల నుండి మధ్యాహ్నం 1-00 గం။ల మధ్య 08922276163కు ఫోను చేసి తమ సమస్యలను తెలియజేవచ్చునన్నారు. టెలీస్పందనకు ఫోను ద్వారా వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ విని, పరిశీలించి పరిష్కారం నిమిత్తం, సంబంధిత అధికారులను ఆదేశించారు. 'టెలీ-స్పందన' కార్యక్రమంకు వచ్చిన కొన్ని ముఖ్యమైన ఫిర్యాదులు.

విజయనగరం, వి.టి.అగ్రహారంకు చెందిన ఎమ్.గురునాయుడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ తనకు వై జంక్షను వద్ద 25 సెంట్లు భూమి ఉన్నదని, కె.రమేష్ అనే వ్యక్తి ఆ భూమి తనదని భూమి వద్దకు వచ్చి బెదిరిస్తున్నారని, సదరు రమేష్‌పై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా విజయనగరం రూరల్ ఎస్.ఐను ఆదేశించారు. జామి మండలం, అన్నంరాజుపేట గ్రామానికి చెందిన సన్యాసిశెట్టి జిల్లా ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ వెంకటరావు మరియు ఒకతను తన టేకు చెట్లును నరికి తీసుకునివెళ్ళిపోయారని, తనకు న్యాయం చేయవలసిందిగా కోరారు.

ఈ ఫిర్యాదు పై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, ఫిద్యాదికి న్యాయం చేయాల్సిందిగా జామి ఎస్.ఐని ఆదేశించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ స్వయంగా ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసు కోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే తనకు నివేధిం చాలని అధికారులను జిల్లా ఎస్పీ బి. రాజకుమారి ఆదేశించారు.

# టిట్ కో గృహాలకోసం నగదు కట్టిన లబ్ధిదారులకు న్యాయం చేయాలి



గాజువాక: టిట్ కో గృహాలకోసం నగదు కట్టిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఏ పి టిట్ కో గృహ సముదాయం వద్ద గాజువాక మాజి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేదేపా ప్రభుత్వం హయాంలో గాజువాక మండలం మంగళపాలెంలో ఉన్న టిట్కో గృహాలు కోసం ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున అప్పుచేసి డబ్బులు కట్టిన వారికి, ఫ్లాట్ కుడా అల్లొట్మెంట్ చేసారని అన్నారు. అయితే వైకాపా ప్రభుత్వం నిర్మాణాన్ని ఆపివేయడం దారుణం అని మండిపడ్డారు. కొట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణం చేసిన ఏ పి టిట్ కో గృహ సముదాయాన్ని ఆపివేయడం, అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వంలో 80 శాతం పూర్తి అయినా ఇల్లులను వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా వాటిని విస్మరించి లబ్ధిదారులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. 80 శాతం పూర్తయిన ఇండ్లను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పాలని ప్రభుత్వానికి కట్టిన డబ్బులకు వైసిపి ప్రభుత్వం న్యాయం చెయ్యాలని డిమండ్ చెసారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, తేదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# ఇళ్లపట్టాలు తగువు హైకోర్టుకు...

## - గోపాలపురం పంచాయితీలో సాగుదారుల వ్యతిరేకత - మొండిగా ముందుకెళ్తున్న రెవెన్యూ అధికారులు - ఎలాగైనా అడ్డుకుంటాం అంటున్న స్థానికులు



అనకాపల్లి : మండలంలోని గోపాలపురం పంచాయితీ పరిధిలోగల వెంకటరమణపేట గ్రామ రెవెన్యూ పరిధిలో ఇళ్ల పట్టాల మంజూరుకు కేటాయించిన స్థలం వివాదాలకు వేదికైంది. ఈ తగువు కాస్త హైకోర్టుకు చేరడం గమనార్హం వివరాలలోకి వెళ్తే సుమారు 190 మందికి పైచిలుకు లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు గాను సదరు భూమిలో లే అవుట్ వేసే క్రమంలో అక్కడ రెవెన్యూ అదికారులు స్థలాన్ని చదునుచేసే పనులను పది రోజల క్రితం ప్రారంబించారు. ప్రారంబం నుంచి ఆ పనులకు సంబందించి, వివాదం మొదలైంది. దళిత గిరిజన వర్గాలతో పాటు, ఇతరరితర సామాజికవర్గాలకు చెందిన కొందరు ఆయా భూముల్లో వివిద రకాల మొక్కలను సాగుచేసుకుంటున్నారు. భూసేకరణ సమయంలో రెవెన్యూ అధికారులు సాగుదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే, యంత్రాల సాయంతో మొక్కలు తొలగించి, భూమిని చదును చేసే పనులు మొదలు పెట్టారు. సాగుదారులు భూమి చదును చేసేందుకు వచ్చిన అదికారులతో తమ గోడు చెప్పుకున్నా, ప్రయోజనం లేకపోవడంతో వారు అనకాపల్లి తహశీల్దార్, ఆర్డీవో, విశాఖ జిల్లా కలెక్టర్‌కు తమకు న్యాయం చేయాలంటూ విన్నపాలు అందజేసారు. కాని అధికారుల నుంచి ఎలాంటి జవాబు రాలేదు. పైగా రైతుల అర్జీని భేకాతరు చేస్తున్నట్లు నిరంతరం గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు సాగుభూమిలో చొరబడి తమపై దౌర్యన్యానికి కూడా దిగుతున్నారని, రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా సాగుదారుల్లో ఒకరైన గొల్లవిల్లి రామునాయుడు అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి ఈ భూసేకరణ విషయమై హైకోర్టును ఆశ్రయించారు. ఈవిషయాన్ని రామునాయుడు స్వయంగా మీడియాకు తెలిపారు. భూసేకరణ నేపద్యంలో తమకు వేరే ప్రదేశంలో సాగుభూమిని కేటాయించాలని, లేదా ప్రస్తుతం తమ సాగులో ఉన్న భూమిని తీసుకున్నందుకు గాను, నష్టపరిహారం నగదురూపేనా ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ అభ్యర్దనను అధికారులు పట్టించుకోకపోవడం వలనే తాము కోర్టుకు వెళ్లినట్లే చెబుతున్నారు. కోర్టుకు వెళ్లామని చెప్పినా ఇంకా తమ



ఆదేశాలు అందలేదు గనుక అంతవరకు తమ ఇష్టమే అన్నట్లుగా అధికారులు సదరు భూమిలో పనులు చేపట్టడం పట్ల, ఎలా వ్యతిరేకత తెలపాలో తమకు అర్దంకావడం లేదంటున్నారు. తమతో పాటుగా దళిత గిరిజన వర్గాలకు చెందిన సాగుదారులు కూడా, ఉన్నందున వారికి తొలి ప్రాధాన్యతోల న్యాయంచేసి, మలి ప్రాదాన్యతతో తమకు చేసిన న్యాయం చేసిన ఇబ్బందిలేదని, రామునాయుడు, అతని మద్దతు దారులు అంటున్నారు. తప్పితే అధికారులు మొండి వైఖరి ప్రదర్సిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ వ్యవహారం మొత్తంలో వైసీపీ మండల నాయకుడు ఒకరు అధికారులపై ఒత్తిడి తెచ్చి, తమను ఇబ్బంది పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, సాగుదారులంతా ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

# విద్యుత్ షాక్ తో మరణించిన వారికి తక్షణం నష్ట పరిహారం చెల్లించాలి

## - శెట్టిబత్తుల కుమార్ రాజా




అన్నవరం : తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో అనధికారికంగా నిర్మాణం చేపడుతున్న అలానా కంపెనీలో విద్యుత్ షాక్ తో మరణించినటువంటి ఇద్దరు వ్యక్తులకు న్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రి నందు,

ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు పర్వత.పూర్ణ చంద్ర ప్రసాద్ యొక్క ఆదేశాల మేరకు ధర్నా చేస్తున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకినాడ పార్లమెంటరీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ డిసిసిబి డైరెక్టర్ శెట్టి బత్తుల.కుమార్ రాజా మాట్లాడుతూ జజజ

అలానా కంపెనీ లో విద్యుత్ షాక్ తో చనిపోయిన ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఓబీసీ రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలి

కాకినాడ : బీసీలకు అండాగా కాంగ్రెస్ పార్టీ ఉందని బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఎస్సీ విభాగ జాతీయ అధ్యక్షులు కొప్పల రాజు నేతృత్వంలో బీసీలకు మెడికల్ సీట్లలో రిజర్వేషన్ ఉండాలన్న విషయానికి మద్దతు తెలియ చేస్తూ కేంద్ర ప్రభుత్వంనకు లేఖ రాశారని సోనియమ్మకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

# హత్యా రాజకీయాలు మానుకోవాలి

## వాసుపల్లి జానకిరామ్




భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురదజల్లడానికి విశాఖ అర్బన్ టిడిపి అధ్యక్షుడు వాసుపల్లి గణేష్ కుమార్ చౌకబారు నాటకాలాడుతున్నారని భీమిలిలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఉత్తరాంధ్ర బిసి ఐక్యవేదిక విశాఖ కన్వీనర్ వైఎస్ఆర్ సి.పి నాయకుడు వాసుపల్లి జానకిరామ్ విమర్శించారు. ఈ రాష్ట్రంలో బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేసే ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తుందని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుంటే ప్రభుత్వ పనితీరు చూసి ఓర్వలేక హత్యా రాజకీయాలు ప్రోత్సహించి చంద్రబాబు నాయుడు బీసీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే గణేష్ కుమార్ ని పావులా వాడుకొని హత్యా రాజకీయాలు చేస్తున్నారని ఇకనైనా అవి మానుకోవాలని జానకిరామ్ అన్నారు.

పది సంవత్సరాల క్రితం అప్పటి మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకట రమణని చంద్రబాబు నాయుడు సోనియాగాంధీ తో చేతులు కలిపి అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా అరెస్టు చేస్తే అప్పుడు బీసీ సామాజికవర్గం గుర్తుకు ఎందుకు రాలేదని మండిపడ్డారు. బీసీ సామాజికవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులను జగన్ మోహన్ రెడ్డి కక్షపూరితంగా అరెస్టు చేస్తున్నారని విశాఖపట్నం టీడీపీ కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టి గణేష్ కుమార్ ఒంటికి సంకెళ్ళు వేసుకొని

"నేను బీసీ నన్ను అరెస్టు చేయండి" అని నినాదాలు ఇవ్వటం ఆశ్చర్యానికి గురి చేసిందని అని అన్నారు. ఈ ఎస్ ఐ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన మాజీ మంత్రి అచ్చంనాయుడు ప్రస్తుతం అరెస్టు కాబడి జైల్లో ఉంచడం జరిగిందని, మోకా భాస్కర్ హత్య కేసులో హత్య జరిగిన తరువాత నిందితుడితో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర స్వయంగా ఫోన్ లో మాట్లాడటం ప్రధాన నిందితుడుకి సూచనలు చేయటం వంటి వాటిని స్వయంగా జిల్లా ఎస్పీ పత్రికా సమావేశంలో వివరిస్తే ఇంకా టీడీపి నాయకులు అమాయకులని గణేష్ కుమార్ బీసీ కార్డును వాడుకోవటం బీసీలను మరీ ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గాన్ని హత్యలు చేసే సామాజిక వర్గంగా చిత్రీకరించడానికి టీడీపీ నాయకులు పూనుకున్నారని జానకిరామ్ విమర్శించారు. హత్యకు గురికాబడిన మోకా భాస్కరరావు మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాడు అని గణేష్ కుమార్ కు తెలియదా అని జానకిరామ్ ప్రశ్నించారు. చట్టం ఎవరి చుట్టం కాదని తప్పు చేస్తే చట్టానికి ఎవరూ అతీతులు కారని శిక్ష అనుభవించ వలసిందే అని అన్నారు. పాకిస్తాన్ బంగ్లాదేశ్ జైల్లో మగ్గుతున్న బీసీ మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మత్స్యకారులను జగన్ మోహన్ రెడ్డి జైలు నుంచి విడుదల చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంటే చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీల కోసం సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలవుతుంటే సిగ్గులేకుండా గణేష్ కుమార్ చంద్రబాబు భజన చేస్తున్నారని మీడియా పబ్లిసిటీ కోసం వినూత్నంగా ప్రయత్నించడమే లక్ష్యంగా గణేష్ కుమార్ చేస్తున్న పిచ్చి చేష్టలకు బీసీ సామాజికవర్గం తలదించుకుంటుందని, ఈ సమావేశంలో బీసీ నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, పాసి మధు సూధన్ యాదవ్, అప్పికొండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తవలస కోలాటం కళాకారులకు నిత్యావసర వస్తువులు అందజేసిన వివేకానంద సంస్థ



విశాఖపట్నం : 108 రోజులుగా.. అలుపెరగకుండా.. సేవా కార్యక్రమాలు.. కొత్తవలసలోని, జీడివలస గ్రామానికి చెందిన.. జగజ్జనని కోలాటం కళాకారుల బృందానికి... శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర వస్తువులు అందజేసింది..

ప్రముఖ సంఘ సేవకులు.. డి.ఎస్. అగర్వా ల్, మణికుమార్ ఆర్థిక సహాయంతో.. ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది..

కరోనా మహమ్మారి కారణంగా.. కళాకారుల పరిస్థితి దయనీయంగా మారిందని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. అందుకే వారికి నిత్యావసర వస్తువుల అందించి చిరు సహాయం అందించామని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవడం కోసం 108 రోజులుగా.. నిర్విరామంగా.. అలుపెరగకుండా.. సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. వేలాది నిరుపేద కుటుంబాలకు.. బియ్యం బస్తాలు, నిత్యవసర వస్తువులు, కూరగాయలు, పండ్లు వారి ఇంటికి తీసుకువెళ్లి అందించామని తెలియజేశారు. దీంతోపాటు ఘోషా ఆసుపత్రి లో ఉండే గర్భిణీలకు, బాలింతలకు, వారి సహాయకులకు, కూరగాయలు అమ్మే రైతులకు, రిక్షా కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు, ఆటో కార్మికులకు, క్యాబ్ డ్రైవర్ లకు, పారిశుద్ధ్య సిబ్బందికి, పోలీసులకు, ఆరోగ్య సిబ్బందికి ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా.. వేకువజాము, రాత్రివేళల్లో... విధుల్లో ఉండే పారిశుద్ధ్య సిబ్బందికి, పోలీసులకు హార్లిక్స్, రాగిజావ, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు.

# ప్రజలకు వద్దకు సచివాలయ సేవలు

విశాఖపట్నం : 28 వ వార్డ్ గౌరిస్ట్రీట్ సచివాలయంలో నూతనంగా గవర్నమెంట్ ప్రవేశపెట్టిన మీ సేవా సర్వీస్ లో భాగంగా కుల,జనన సర్టిఫికెట్స్ అప్లై చేసినవారికి ఇవ్వటం జరిగింది. ప్రజలు సచివాలయం ల వలన ఆఫీస్ ల చుట్టూ తిరగకుండా సమీప సచివాలయం ల ద్వారా సేవలు పొందటం సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ వార్డ్ ప్రెసిడెంట్ రంధి గోపి కృష్ణ సచివాలయం సిబ్బంది సెక్రటరీలు రూకీయ పి.వి.కిరణ్‌కుమార్, జాన్, అమృత తదితరులు పాల్గొన్నారు.



# 'కళాకారులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం'

## రాష్ట్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు




విశాఖపట్నం : సంప్రదాయ సంగీతంలో తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహా గాయకుడు, వాగ్గేయకారుడు, సంగీత విద్వాంసుడు, గొప్ప మహనీయుడు పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని రాష్ట్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 90 వ జయంతి ఉత్సవాల కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన గావించి, శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి చిత్రపటానికి పూల దండ వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని,కానీ కోవిడ్ కారణంగా తక్కువ మంది సమక్షంలో కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రతి సంవత్సరం అయన జ్ఞాపకార్థం సంగీత కళాకారులకు పది లక్షల నగదు ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సం.కరొన కారణంగా వీలు పడలేదన్నారు కళాకారుల సంక్షేమానికి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని ఈ సం.వృద్ధ కళాకారులకు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు.

తూర్పుగోదావరి జిల్లా, శంకర గుప్తం గ్రామంలో సంగీత విద్వాంసుల కుటుంబం లో జులై 6 న బాలమురళీకృష్ణ జన్మించారన్నారు. కర్ణాటక సంగీతానికి గౌరవం, గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కొన్ని వేల సంగీత కచేరీ లను చేసి శ్రోతలను మంత్ర ముగ్ధులను గావించారన్నారు. జాతీయ స్థాయిలో పద్మ విభూషణ్ , పద్మ భూషణ్, పద్మశ్రీ వంటి అత్యున్నత పురస్కారాలను పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి తెలుగు వాడు కావడం మనందరి గర్వ కారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక సంగీతానికి గుర్తింపు, గౌరవం తెచ్చిన ఘనత , సంగీత సాహిత్య మూర్తి శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని కొనియాడారు. తన ఎనిమిదవ ఏటనే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కచేరీ చేసి సంగీత ప్రతిభను కనబరిచారన్నారు. సంప్రదాయ సంగీతంలో అనేక ప్రయోగాలు చేయడం ,సినీరంగంలో ప్రవేశించి నటించడం, సినీ గీతాలను, కీర్తనలను ఆలపించారన్నారు.

జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ మాట్లాడుతూ శ్రీ మంగళంపల్లి గారు దక్షిణ భారత దేశంలో అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రీయ, కర్ణాటక, హిందుస్థానీ సంగీతంలో విశేష ప్రతిభ కన పరిచి సంగీతపరంగా మంచి గుర్తింపు తెచ్చారని, వారిచ్చిన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం శ్రీదేవి, ఆర్డిఓ పెంచల కిషోర్, జిల్లా టూరిజం అధికారి పూర్ణిమా దేవి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి మణిరామ్ , కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.




# పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేందుకు సర్వం సిద్ధం..

## భారత ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ జనరల్ బిఎస్.రాజు




న్యూఢిల్లీ: భారత్- చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు దిగితే తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ జనరల్ బిఎస్.రాజు తెలిపారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ అంతటి దుస్సాహసానికి పూనుకుంటుందని తాము భావించడం లేదన్నారు. అయితే తూర్పు లదాఖ్‌లోని పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని జమ్మూ కశ్మీర్‌లోకి పాక్ ఉగ్రవాదులను పంపేందుకు అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. గల్వాన్ లోయలో భారత్- చైనాల మధ్య ఘర్షణల నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాకిస్తాన్ భారీగా సైన్యాన్ని మోహరిస్తుందనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై స్పందించిన శ్రీనగర్ కార్ప్స్ కమాండర్ బీఎస్ రాజు ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు.

"ఇప్పటి వరకైతే సరిహద్దుల వెంబడి పాక్ సైన్యం కదలికల్లో పెద్దగా మార్పేమీ కనిపించలేదు. అయితే డిఫెన్స్ పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు అనిపిస్తోంది. ఏదేమైనా వాళ్లకు ధీటుగా జవాబిచ్చేందుకు మేం సిద్ధంగానే ఉన్నాం. ఇక ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ నుంచి భారీ సంఖ్యలో ఉగ్రవాదులు భారత్‌లో ప్రవేశించే అవకాశం ఉంది. దాదాపు 300 మంది ఉగ్రవాదులు దేశంలో చొరబడేందుకు ఎదురుచూస్తున్నారనే సమాచారం ఉంది. వాళ్లను పట్టుకునేందుకు మా సైనికులు సిద్ధంగానే ఉన్నారు. నియంత్రణ రేఖ వెంబడి పాక్ దుస్సాహసానికి పాల్పడకుండా 15 కార్ప్స్ అన్ని రకాలుగా సన్నద్ధంగా ఉంది" అని తెలిపారు. ఇక మే నెలలో మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది రియాజ్ నైకూను భారత్ మట్టుబెట్టడం గురించి ఆయన మాట్లాడుతూ.. హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు ఇది గట్టి ఎదురుదెబ్బ అని, హిజ్బుల్‌తో పాటు వివిధ ఉగ్రసంస్థలు కూడా నైకూను మిస్సవుతాయని పేర్కొన్నారు.

# పుట్టినరోజు వేడుకలకు దూరం

## - స్వయంగా ప్రకటించిన మంత్రి ధర్మాన



నరసన్నపేట : జిల్లాలో కరోనా మహమ్మారి ప్రబలుతున్న దృష్ట్యా తనకు పుట్టినరోజున శుభాకాంక్షలు తెలిపేందుకు ఎవరూ స్వయంగా రావద్దని మంత్రి ధర్మాన కృష్ణదాస్ కోరారు. అంతా కలసి వేడుకలు జరుపుకునేందుకు ఇది సమయం కాదని, బాధ్యతను చాటుకుందామని అన్నారు. నరసన్నపేట నుంచి సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తనపై ఉన్న అనంతమైన అభిమానానికి తన విజయమే నిదర్శనమని, ఇక ప్రత్యేకంగా తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు రావాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధి గా తాను ఎలాంటి వేడుకలు చేసుకోవడం లేదని జిల్లా అధికారులు, అభిమానులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించాలని కృష్ణదాస్ కోరారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వాట్సాప్, ఫేసుబుక్ లాంటివి ఉన్నాయని, పెద్ద మనసుతో తన నిర్ణయానికి మద్దతునిచ్చి సహకరించాలని ఆ ప్రకటనలో తెలిపారు.


# స్నేహమంటే ఇదే కదా !



స్నేహం.... జీవన గమనంలో చెరగని గుర్తుగా మిగిలిపోయే మైలురాయి. ఇరువురి మధ్య జనియించే దీని ప్రసస్థత ఆది తప్ప అంతం లేనిది. అటువంటి స్నేహమే వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావుల స్నేహం. జానకిరామరాజు పుట్టినరోజు సందర్భంగా ఈ ఇద్దరి మధ్య అనుబంధాన్ని " విజయభాను" గుర్తు చేస్తోందిలా.. ! "జానీ" అనుభవం ఉన్న ఒక నిజాయితీ గల నాయకుడు. కొన్నాళ్లు కుళ్లు రాజకీయాలను వ్యతిరేకించి తర్వాత కాలంలో నిజాయితీకి నిదర్శనంగా ఆవిర్భవించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి రెండవ దశ రాజకీయ జీవితాన్ని ఆరంభించిన సంగతి తెల్సిందే. జానీ స్వతహాగా సమాజ సేవకుడు. రాజీకీయాలు చేసినా స్వలాభం చూసుకోనివాడు. అతనితో స్నేహం చేయాలంటే అలాంటి లక్షణాలు తప్పనిసరి. ఆళ్ల నాగేశ్వరరావు జానీతో చిరకాలం స్నేహం కొనసాగిస్తూ సమాన లక్షణాలను నిరూపించుకుంటున్నాడు.జానీకి ఉన్న ఉన్నతమైన ఆలోచనా విధానాలు, లక్షణాలు అతనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ పగ్గాలు వచ్చేలా చేసాయ్. అదే సమయంలో ఆళ్ల నాగేశ్వరరావు అనకాపల్లి పట్టణ పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ సంస్థాగత ఒడిదుడుకులకు లోను కాకుండా ఉండాలంటే అధ్యక్షుడు, అధికార ప్రతినిధి సమన్వయంతో పాటుగా స్నేహశీలత కూడా పాటిస్తేనే అది సాధ్యమవుతుంది. ఆ విషయంలో జానీకి తోడు ఆళ్ల నాగేశ్వరరావు. ఎక్కడా, ఏ విషయంలోనూ ఇబ్బందికి తావు లేకుండా నడిచారు. ఇది వారి రాజకీయ సమైఖ్యతకు నిదర్శనం. పార్టీ కార్యక్రమాల పట్ల విలువ చూపిస్తున్న నిబద్ధతతో ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ ఎప్పటికప్పుడు అందిస్తున్న ప్రోత్సాహం తోడుగా ఉండటం వలనే తాము ప్రశాంతమైన రాజకీయాలు చేస్తూ ముందుకు సాగుతున్నారని, పార్టీ శ్రేణులు అంటున్నారు. ఎమ్మెల్యే అమర్ ప్రోత్సాహంతో వీరు ఇరువురు నిరంతరం ఇలాగే ముందుకు సాగాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు. ఇకపోతే వ్యక్తిగత జీవితంలో కూడా జానీ, ఆళ్ల నాగేశ్వరరావు ఇద్దరూ మంచి స్నేహితులు. ఒక రకంగా చూస్తే రాజకీయంలో కుదిరిన వారికి నిజ జీవితంలో స్నేహం అంత తొందరగా కుదరవు. కానీ వీరిద్దరి మధ్య నిజ జీవితంలోనూ స్నేహం కుదిరింది. జానీ అజాత శత్రువు అయితే, ఆళ్ల నాగేశ్వరరావు అజేయుడు. వీరిద్దరి స్నేహం చిరకాలం అలాగే కొనసాగాలని, పట్టణంలో పార్టీ కలకాలం బాగుండాలని పార్టీ శ్రేణులు కోరుకుంటూ జానీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నాయ్.

# 'రాజధాని రైతుల త్యాగాలు వృథా కానీయం'

## జనసేన అధినేత పవన్ కల్యాణ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం రైతులు చేసే పోరాటానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంఘీభావం తెలిపారు. రాజధాని పోరాటం 200 రోజులు దాటిన సందర్భంగా ఆయన రైతుల గురించి మాట్లాడారు. "రాజధాని కోసం రైతులు 34 వేల ఎకరాలను త్యాగం చేశారు. రాజధాని మార్పుపై ఏకపక్ష నిర్ణయం రైతులను అవమానించడమే. రాజధాని రైతులు, మహిళలు 200 రోజులుగా పోరాటం చేస్తున్నారు. వారికి జనసేన మద్దతు ఉంటుంది. వారి త్యాగాలను వృథా కానీయం"అని పవన్ కల్యాణ్ అన్నారు.

# ఏపీయస్ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం లో విలీనం చేయడం చారిత్రక ఘట్టం

## ఉద్యోగ భద్రత కల్పిస్తామని పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

## జిల్లా పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా సత్యసాయి కృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం




విశాఖసిటీ : ప్రతినెల జీతాలు వస్తాయో రావో ఇంట్లో ఏ వస్తువులు తాకట్టు పెట్టాలి అని ఎదురుచూసే స్థాయి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగ భద్రత తో సమాజంలో జీవించే స్థాయికి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మమ్మల్ని తీసుకువచ్చారని జిల్లా పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా సత్యసాయి కృష్ణారెడ్డి తెలియజేశారు. సోమవారం జిల్లా పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా సత్యసాయి కృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ

ఏపీఎస్ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం లో విలీనం చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వ సంస్థగా మార్చడం చారిత్రక ఘట్టమని ఆయన తెలిపారు. సభ్యులందరూ శక్తి వంచన లేకుండా అసోసియేషన్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని జిల్లాలో పది డిపోల ఉద్యోగుల సమస్యలు పరిష్కరిం చడంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నో సంవత్సరాలుగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా సేవలందించిన ఎ.సురేష్‌నా యుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి సంస్థకు చేసిన మేలుకు ఆకర్షితుడై సంస్థనందు ఇక ఉద్యోగ సంఘాలు మాత్రమే వుంటాయని, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రవీంద్రరెడ్డి నేతృత్వంలోనిపిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నందు తన అనుచరులు సుమారు 500 మంది కార్మికులతో జాయిన్ అయిన ఎ.సురేష్ నాయుడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీయస్ఆర్టీసీ నందు 52వేలమంది కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి మా అందరి గుండెల్లో ఆరాధ్య దైవంగా వుంటారని తెలియజేశారు.

ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీలో చట్టం చేసి కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారని సీఎం జగన్మోహన్‌రెడ్డి సేవలను కొనియాడారు. గతంలో కార్మిక సంఘాలలో వున్నవారు కేవలం వారి వారి స్వలాభం కొరకై పనిచేశారని, కాని ఈ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏ కార్మిక సంఘం కూడా ఏ రకమైన విజ్ఞాపనగాని, ఉద్యమం గాని చేయకుండానే పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఏపీయస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మా అందరి అదృష్టమని అన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఎల్లవేళలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీయస్ఆర్టీసీ ఉద్యోగులందరూ పిటిడి వైయస్ఆర్ ఈఏ నందు సభ్యులుగా చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చల్లా చంద్రన్న పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జెయమ్ నాయిడు జిల్లా కార్యదర్శి మరియు ఏపీఎస్ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.**, Published and Printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com